



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక　PEN POWER TELUGU DAILY　ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12　సంచిక : 11　పేజీలు : 8+8　ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి　శనివారం 30 ఆగస్టు 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda



## నాకు పార్టీలతో పని లేదు..
# మీకోసం పనిచేస్తా

హైదరాబాద్ పెన్ పవర్:తనకు పార్టీలతో పని లేదని..మునుగోడు ప్రజల కోసం పనిచేస్తానని అన్నారు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి. చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలిశారు ట్రిపుల్ ఆర్ రైతులు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. ట్రిపుల్ ఆర్ రైతుల సమస్యల కొరకు ఎంత వరకైనా వెళ్తానని చెప్పారు. ట్రిపుల్ ఆర్ అలైన్మెంట్ విషయంలో గత ప్రభుత్వం చౌటుప్పల్ రైతులకు అన్యాయం చేసిందన్నారు. దివిస్ కంపెనీతో గత ప్రభుత్వం కుమ్మక్కై అలైన్ మెంట్ మార్చి, రైతులను మోసం చేశారని ఆరోపించారు రాజగోపాల్ రెడ్డి. ట్రిపుల్ ఆర్ రైతులకు సహాయం చేస్తానన్న

వివరాలు 2లో..

## కారు పార్టీకి కాళేశ్వర కష్టం..
## ముందు నుయ్యి వెనుక గొయ్యి..
### అసెంబ్లీకి కేసీఆర్ దుమ్మా కొట్టే ఛాన్స్..




- కేసీఆర్ సమాధానం లేకే రాలేదని న్యాయస్థానానికి చెంప్పనున్న సర్కారు
- గొడవ చేస్తే చర్చ జరగనీయకుండా అడ్డుకున్నారని కోర్టుకు చెప్పే అవకాశం
- ఇందుకు సంబంధించిన వీడియోలను కోర్టుకు అందించనున్న ప్రభుత్వం
- చర్చ జరగనిస్తే పార్టీ మనుగడకు తీవ్ర నష్టం వాటిల్లే చాన్స్
- కోర్టులో వేసిన పిటిషన్ గులాబీ పార్టీ మెడకు చుట్టుకుంటుందా.?

హైదరాబాద్ పెన్ పవర్: కేసీఆర్ మానస పుత్రి కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎష్ పార్టీని ఇబ్బంది ల్లోకి నెట్టే అవకాశం ఉన్నట్టు కనిపిస్తోంది. కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక రేపటి నుంచి జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో కీలకంగా మారనుంది. ఈ సెషన్ కు ప్రతిపక్ష నేత కేసీఆర్ గైర్హాజరవుతారని తెలుస్తోంది. దీనిపై చర్చించాల్సిన బాధ్యతను ప్రధానంగా ఇరిగేషన్ మాజీ మినిస్టర్ హరీశ్ రావుకు అప్పగించారు. కాళే శ్వరం కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ కేసీఆర్, హరీశ్ రావు ఇటీవలే హై కోర్టును ఆశ్రయించారు. విచారణ కు స్వీకరిం చిన న్యాయస్థానం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తర్వాత నివేదికను కోర్టుకు సమర్పిస్తామని ప్రభుత్వం వెల్లడించింది. దీంతో హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రేపటి నుంచి ప్రత్యేక అసెంబ్లీ సెషన్ ఏర్పాటు చేసింది,

వివరాలు 2లో..



## జపాన్, భారత్ కలిస్తే అద్భుతాలే

- టోక్యోలో ఇండియా-జపాన్ ఎకనామిక్ ఫోరంలో ప్రధాని మోదీ ప్రసంగం
- ప్రపంచమంతా ఇప్పుడు భారత్ వైపే చూస్తోందన్న ప్రధాని
- త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామని ధీమా

హైదరాబాద్ పెన్ పవర్:భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రపంచ దేశాలు కేవలం మన వృద్ధిని గమనించడమే కాకుండా మనపై గట్టి నమ్మకంతో ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. త్వరలోనే భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జపాన్ పర్యటనలో ఉన్న మోదీ... టోక్యోలో జరిగిన ఇండియా–జపాన్ ఎకనామిక్ ఫోరంలో ప్రసంగించారు.
ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... “ప్రస్తుతం భారతదేశంలో రాజకీయ స్థిరత్వం, ఆర్థిక స్థిరత్వం, పారదర్శక విధానాలు ఉన్నాయి. ప్రపంచంలోనే

వివరాలు 2లో..

# కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలి

### స్కూళ్లు, కాలేజీల్లో ఫేషియల్ రికగ్నిషన్.. విద్యావ్యవస్థపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

- స్కూళ్లు, కాలేజీల్లో ఫేషియల్ రికగ్నిషన్ హాజరుకు సీఎం ఆదేశం
- విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందికి కొత్త విధానం వర్తింపు
- విద్యాసంస్థల నిర్మాణ పనులన్నీ ఒకే ఏజెన్సీకి అప్పగింత
- బాలికల పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణం వేగవంతం చేయాలని సూచన



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ రాష్ట్రం లోని అన్ని ప్రభుత్వ పాఠ శాలలు, కళాశాల ల్లో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందికి ముఖ గుర్తింపు (ఫేషియల్ంసం స్థల్లోని లోపాలను సరిదిద్దవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (ఐసీసీసీ) విద్యాశాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు అన్నిచోట్లా మౌలిక వసతులను మెరుగుపరిచి, మెరుగైన బోధనా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. విద్యాశాఖ పరిధిలో అదనపు తరగతి గదులు, వంటశాలలు, టాయిలెట్లు, ప్రహరీ గోడల నిర్మాణ పనులను వేర్వేరు ఏజెన్సీలకు అప్పగించడం సరైన పద్ధతి కాదని సీఎం అన్నారు. నాణ్యత, పర్యవేక్షణ, నిధుల వినియోగంలో పారదర్శకత కోసం ఈ నిర్మాణ పనులన్నింటినీ ఒకే విభాగానికి అప్పగించాలని ఆదేశించారు. ఇప్పటికే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్

వివరాలు 2లో..



## స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా..
### ఫేస్ చేయడానికి నేను రెడీ

హైదరాబాద్ పెన్ పవర్:స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కీలక వ్యాఖ్యలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు, స్పీకర్ అనర్హత వేటు గురించి ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. స్పీకర్ నిర్ణయం ఎలా ఉన్నా ఫేస్ చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. తన ఎన్నికల గురించి ఆలోచన వద్దన్నారు. ఉప ఎన్నిక వస్తదా..రాదా ? వస్తే ఏం చేద్దామనేది తర్వాత ఆలోచిద్దామ న్నారు. ఏ గ్రామంలో చూసినా స్థానిక ఎన్నికల్లో

వివరాలు 2లో..

## రుషికొండ భవనాల వినియోగంపై ఏపీ ప్రభుత్వం దృష్టి

- భవనాలను ఎలా వినియోగించుకోవాలనే అంశంపై కసరత్తు
- అధ్యయనం చేసేందుకు ముగ్గురు మంత్రులతో కమిటీ ఏర్పాటు
- సరైన విధంగా వినియోగించే మార్గాలపై అధ్యయనం చేసి సిఫార్సులు చేయాలని సూచన



హైదరాబాద్ పెన్ పవర్:రుషికొండలో గత ప్రభుత్వం నిర్మించిన భవనాలను ఏ విధంగా వినియోగించాలనే అంశంపై ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. భవనాల వినియోగంపై సమగ్ర అధ్యయనం చేసేందుకు ముగ్గురు మంత్రులతో కూడిన

వివరాలు 2లో..

## తహసీల్దార్ నివాసంలో ఏసీబీ సోదాలు..
## రూ.కోట్ల విలువైన ఆస్తులు గుర్తింపు



హైదరాబాద్ పెన్ పవర్: ఖిలా వరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వరరావు నివాసంలో శుక్రవారం ఏసీబీ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఫిర్యాదుపై హనుమకొండ చైతన్యపురిలోని

వివరాలు 2లో..

## పెద్దపల్లి జిల్లాలో ఆకట్టుకుంటున్న కరెన్సీ గణపతి..
## 9,99,999 నోట్లతో అలంకరించిన నిర్వాహకులు




హైదరాబాద్ పెన్ పవర్:వినాయక చవితి సందర్భంగా గణనా థుడిని వివిధ రూపాల లో తయారు చేసి అలంకరిస్తుంటారు భక్తులు. పెద్దపల్లి జిల్లాలో కరెన్సీ నోట్లతో అలంకరించిన గణనాధుడు భక్తులను ఆకట్టుకుం టున్నాడు. సుల్తానాబాద్

వివరాలు 2లో..




## బీసీసీఐ అధ్యక్ష పదవికి రోజర్ బిన్నీ రాజీనామా..
### తాత్కాలిక ప్రెసిడెంట్‌గా రాజీవ్ శుక్లా!

- బీసీసీఐ అధ్యక్ష పదవి నుంచి రోజర్ బిన్నీ ఔట్
- తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రాజీవ్ శుక్లా
- సెప్టెంబర్‌లో జరగనున్న బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశం, ఎన్నికలు
- టీమిండియా కొత్త స్పాన్సర్ కోసం బీసీసీఐ తీవ్ర ప్రయత్నాలు
- పాత నిబంధనల ప్రకారమే జరగనున్న సెప్టెంబర్ ఎన్నికలు

పెన్ పవర్ డెస్క్:బీసీసీఐలో అనూహ్య పరిణామం చోటుచేసు కుంది. ప్రస్తుత అధ్యక్షుడు రోజర్ బిన్నీ తన పదవి నుంచి తప్పుకున్నారు. ఆయన స్థానంలో

వివరాలు 2లో..

## రామసేతుకు జాతీయ హెూదా
## కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు




- రామసేతుకు జాతీయ హెూదాపై సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్
- విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు
- కేంద్ర సాంస్కృతిక శాఖ, పురావస్తు శాఖకు నోటీసులు
- తన విజ్ఞప్తిపై కేంద్రం నిర్ణయం తీసుకోవడం లేదని స్వామి ఆరోపణ
- గతంలో ఇచ్చిన ఆదేశాలను పాటించాలని పిటిషన్‌లో అభ్యర్థన
- నిర్ణీత సమయంలోగా దీనిపై తేల్చాలని కోర్టుకు విజ్ఞప్తి

వివరాలు 2లో..

## గణేష్ నిమజ్జనాలు షురూ..
## ట్యాంక్ బండ్ దగ్గర ట్రాఫిక్ ఆంక్షలు




హైదరాబాద్ పెన్ పవర్::హైదరాబాద్ మహానగరంలో గణేష్ నిమజ్జనాలు షురూ అయ్యాయి. శుక్రవారం (ఆగస్టు29) ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో వినాయక నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. గణేష్ నిమజ్జనాల సందర్భంగా ఈ రోజునుంచి సెప్టెంబర్ 5 వరకు ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. నిమజ్జనానికి వచ్చే విగ్రహాలను బట్టి ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా పీవీఎన్ఆర్ మార్గ్‌లలో మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి.ట్రాఫిక్ డైవర్షన్లు ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ నుంచి వచ్చే వాహనాలను కవాడిగూడ మీదుగా దారి మళ్లించారు. ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ స్టేడియం దగ్గర నిమజ్జనాల కోసం క్రేన్లను ఏర్పాటు చేశారు. నిమజ్జనం సందర్భంగా ఎటువంటి

వివరాలు 2లో..

## తెలంగాణలో బీజేపీ భ్రష్టు పట్టింది



- నేడు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం... రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు
- తనకు బాస్ లు ఎవరూ లేరన్న రాజాసింగ్
- స్వతంత్ర అభ్యర్థిగా అసెంబ్లీకి వెళతానని వ్యాఖ్య

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ శాసనసభ సమావేశాలు నేడు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

వివరాలు 2లో..

ఎడిటర్ వ్యూ

# మోడీ గ్రాఫ్ పెరుగుతోందా.. అదెలా అంటే ?

దేశంలో మూడు సార్లు వరసగా ప్రధానిగా ప్రమాణం చేసి కొత్త రికార్డుని నెలకొల్పారు నరేంద్ర మోడీ. పండిట్ నెహ్రూ తరువాత స్థానంలోకి ఆయన ఆ విధంగా వచ్చేశారు. మరోసారి ప్రధాని కావాలని కూడా ఆయన అభిమానులు కోరుకుంటున్నారు. అయితే 2024 ఎన్నికల ఫలితాలు మాత్రం బీజేపీని మోడీని కొంత నిరాశ పరచాయి. మోడీ నాయకత్వం వహించిన బీజేపీ ఫుల్ మెజారిటీకి దూరంగా నిలిచింది. కేవలం 240 ఎంపీ సీట్లు మాత్రమే సొంతంగా సాధించగలిగింది. అయితే పదిహేను నెలలు గిర్రున తిరగకుండానే దేశంలో రాజకీయం మారుతోందని అది మోడీకి అనుకూలంగా ఉందని తాజా అంచనాలు చెబుతున్నాయి.

**బలమైన నాయకుడిగా :**
మోడీకి 2014 నుంచి ఈ రోజు దాకా ఉన్న అతి పెద్ద ప్లస్ పాయింట్ ఏమిటి అంటే బలమైన నాయకుడు అని. ఆయన నాయకత్వం మీద జనాలకు ఆ విధంగా నమ్మకం అయితే ఉంది. ఇక దేశంలోనూ అంతర్జాతీయంగా జరుగుతున్న అనేక పరిణామాలను కూడా బేరీజు వేసుకున్న ప్రజలు ఈ కీలక సమయంలో ఆయన ఉండడమే సబబు అని భావిస్తున్నారు. భారత్ కి ఈ రోజు పక్కలో బల్లెంలా పాక్ తో పాటు బంగ్లాదేశ్ ఉంది. అలాగే చైనా కూడా భారత్ కి నమ్మదగిన నేస్తం కాదు. ఈ నేపథ్యంతో పాటు నిన్నటిదాకా మిత్రుడిగా ఉన్న అమెరికా ఈ రోజు శత్రువుగా మారి కాలు దువ్వుతోంది. ఈ నేపథ్యం నుంచి చూసినపుడు భారత్ కి ఇంటా బయటా సవాళ్ళు అనేకం ఉన్నాయి. ఈ క్లిష్ట పరిస్థితులలో నరేంద్ర మోడీ నాయకత్వం వీటికి సరైన జవాబు చెప్పగలదని అత్యధికుల విశ్వాసంగా కనిపిస్తోంది అంటున్నారు.

**సరిసాటి లేకుండా పోయారా :**
ఒకప్పుడు దేశ రాజకీయాల్లో ధీటైన నాయకులు ఎంతో మంది ఉండేవారు. కానీ రాను రానూ ఆ కొరత ఎక్కువగా కనిపిస్తోంది. ప్రజాకర్షణ కలిగిన నాయకత్వంతో పాటు అత్యధిక శాతం మంది మన్ననలు పొందే లీడర్లు అవసరం ఉంది ఇక ఒక్కసారి చూసుకుంటే కనుక గత పదకొండేళ్ళ నుంచి నరేంద్ర మోడీ దేశంలో ధీటైన నాయకుడిగా ఎదుగుతున్నారు. ఆయనకు సరిసాటిగా సమీపంలోకి కూడా వచ్చే వారు పెద్దగా కనిపించడం లేదు అని అంటున్నారు. బీజేపీలో కీలక నేతలు సీనియర్లు ఎంతో మంది ఉన్నా కూడా ఎవరికి వారుగా గొప్పవారే కానీ మోడీ స్థానాన్ని ఆయన స్థాయిని ఆక్రమించేవారు అయితే ప్రస్తుతానికి లేరని అంటున్నారు. ఇక బయట చూసినా విపక్షంలోనూ అదే కొరత ఉంది. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఇపుడిపుడే రాటు తేలుతున్నారు. ఆయనకు పాలనానుభవం అయితే లేదు. అదే విధంగా కాంగ్రెస్ కి మునుపటి ఆదరణ ఇంకా దక్కాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలో వస్తున్న సర్వేలు కానీ అంచనాలు కానీ బీజేపీకి ఎక్కువ సీట్లు వస్తాయని చెబుతున్నాయి.

**సిద్ధాంత రాహిత్యం :**
ఇంకో వైపు చూస్తే దేశంలో సాగుతున్న రాజకీయాల్లో సిద్ధాంతాల కంటే రాద్ధాంతాల తం మీదనే పోరు ఎక్కువగా కనిపిస్తోంది. ఒకనాడు సిద్ధాంత పరంగా పార్టీల మధ్య సమరం సాగేది అది జనాలకు కూడా నచ్చేది కానీ ఇపుడు పూర్తిగా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. వ్యక్తిగత విమర్శలు ఎక్కువగా చేసుకుంటున్నారు. ఈ పరిణామాల వల్ల జనాలకు ఆయా పార్టీల పట్ల అంతగా మొగ్గు కనిపించేందుకు ఆస్కారం ఉండడం లేదని విశ్లేషణలు ఉన్నాయి.

**చట్ట సభలను వాడుకోవాలి :**
రాజకీయంగా పై చేయి సాధించాలంటే సిద్ధాంతపరమైన పోరాటం ఉండాలి. దానికి గానూ చట్ట సభలను ఎక్కువగా ఉపయోగించుకోవాలి. కానీ పార్లమెంట్ లో చూస్తే కనుక ప్రతీ సారీ వాయిదాల పర్వమే సాగుతోంది. ఒకే అంశం మీద మొత్తం సెషన్లు కొట్టుకుని పోతున్నాయి. దాని వల్ల అధికార పక్షానికి పోయేది ఏమీ లేకపోయినా విపక్షానికే రాజకీయంగా నష్టం వాటిల్లుతోంది. ఇవన్నీ కూడా ప్రజల మూడ్ ని కూడా తెలియచేస్తున్నాయి.

**మూడ్ ఆఫ్ ది నేషన్ ఇదేనా :**
ఇదిలా ఉంటే ఇండియా టుడే సీ ఓటర్ కలిసి చేసి మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వేలో మరోసారి మోడీ నాయకత్వంలోని బీజేపీకి అవకాశాలు మెరుగు అవుతాయని తేలింది. 2024లో 240 ఎంపీ సీట్లు మాత్రమ సాధించిన బీజేపీ ఈ పదిహేను నెలల్లో మరో ఇరవై సీట్లను పెంచుకుని 260 కి ఎగబాకడం అంటే అది మోడీకి పెరిగిన గ్రాఫ్ గానే చూడాలని అంటున్నారు అదే సమయంలో ఎన్డీయే మిత్రులతో కలిపి ప్రస్తుతం 292 మంది ఎంపీలు మాత్రమే ఉన్నారు ఈ సంఖ్య ఇప్పటికిపుడు ఎన్నికలు జరిగితే ఏకంగా 324కి ఎగబాకుతుంది అని అంటున్నారు. అంటే ఇందులో బీజేపీకి పెరిగిన ఇరవై సీట్లు పోనూ మిత్రులు మరో పది సీట్లు ఎక్కువ సాధిస్తారు అని లెక్క తేల్చింది అన్న మాట. చూడాలి మరి ముందు ముందు మోడీ గ్రాఫ్ ఏ విధంగా ఉంటుందో.

## గణేష్ నిమజ్జనాలు షురూ.. ట్యాంక్ బండ్ దగ్గర ట్రాఫిక్ ఆంక్షలు

- మొదటి పేజి తరువాయి
అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు పోలీసులు. నిమజ్జన ఊరేగింపునకు సీసీ కెమెరాలు, డ్రోన్లు, %ు=% కోడ్ స్కిక్కర్లతో పర్యవేక్షిస్తు న్నారు.

## బీసీసీఐ అధ్యక్ష పదవికి రోజర్ బిన్నీ రాజీనామా.. తాత్కాలిక ప్రెసిడెంట్‌గా రాజీవ్ శుక్లా!

- మొదటి పేజి తరువాయి
బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. సెప్టెంబర్‌లో జరగనున్న బీసీసీఐ ఎన్నికల వరకు శుక్లా ఈ పదవిలో కొనసాగుతారు.
నేషనల్ మీడియా కథనాల మేరకు బుధవారం నిర్వహించిన బీసీసీఐ అపెక్స్ కౌన్సెల్ సమావేశం రాజీవ్ శుక్లా నేతృత్వంలో జరిగింది.. వచ్చే నెలలో జరిగే ఎన్నికల్లో రోజర్ బిన్నీ మళ్లీ పోటీ చేసి గెలిస్తే అధ్యక్షుడిగా కొనసాగే అవకాశం ఉంటుంది. లేనిపక్షంలో సెప్టెంబర్ తర్వాత బీసీసీఐకి కొత్త అధ్యక్షుడు రానున్నారు.

**కొత్త స్పాన్సర్ కోసం తీవ్ర సవాళ్లు**
ఈ సమావేశంలో ప్రధానంగా టీమిండియా కొత్త లీడ్ స్పాన్సర్ అంశంపై చర్చ జరిగినట్లు తెలిసింది. డ్రీమ్11తో ఒప్పందం ముగియడంతో భారత జట్టుకు ప్రస్తుతం ప్రధాన స్పాన్సర్ లేరు. సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇంత తక్కువ సమయంలో కొత్త స్పాన్సర్‌ను ఖరారు చేయడం బీసీసీఐకి పెద్ద సవాలుగా మారింది. “కొత్త టెండర్ పిలిచి, చట్టపరమైన ప్రక్రియలు పూర్తి చేయడానికి సమయం పడుతుంది. అందుకే ఆసియా కప్‌నకు మాత్రమే తాత్కాలిక స్పాన్సర్‌ను తీసుకునే ఆలోచన లేదు. 2027 వన్డే ప్రపంచకప్ వరకు, అంటే సుమారు రెండున్నరేళ్ల పాటు దీర్ఘకాలిక స్పాన్సర్‌ను తీసుకురావడమే మా లక్ష్యం” అని బోర్డు వర్గాలు స్పష్టం చేసినట్లు నివేదికలు పేర్కొన్నాయి.

**పాత నిబంధనల ప్రకారమే ఎన్నికలు**
ఇటీవల పార్లమెంటులో కొత్త జాతీయ క్రీడా పాలన చట్టం ఆమోదం పొందినప్పటికీ, అది పూర్తిగా అమల్లోకి రావడానికి మరో నాలుగు నుంచి ఐదు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. ఈ కారణంగా సెప్టెంబర్‌లో జరిగే బీసీసీఐ ఎన్నికలు, ప్రస్తుతం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు లోధా కమిటీ సిఫార్సులతో రూపొందించిన రాజ్యాంగం ప్రకారమే జరుగుతాయని తెలిసింది. ఈ పాత నిబంధనల ప్రకారం, ఆఫీస్ బేరర్ల వయోపరిమితి 70 ఏళ్లుగా ఉండగా, కొత్త చట్టంలో దానిని 75 ఏళ్లకు పెంచే అవకాశం కల్పించారు.

## జపాన్, భారత్ కలిస్తే అద్భుతాలే

- మొదటి పేజి తరువాయి
అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ మనదే” అని స్పష్టం చేశారు. దేశంలో పెట్టుబడులు కేవలం పెరగడమే కాకుండా, అవి రెట్టింపు అవుతున్నాయని ఆయన వివరించారు. భారత్, జపాన్ మధ్య భాగస్వామ్యం కేవలం వ్యూహాత్మకమే కాదని, అదొక స్మార్ట్ బంధమని ప్రధాని అభివర్ణించారు. ఈ రెండు దేశాల కలయిక ఆసియా శతాబ్దంలో స్థిరత్వం, వృద్ధి, శ్రేయస్సును నిర్దేశిస్తుందని ఆయన అన్నారు.సాంకేతిక రంగంలో భారత్, జపాన్ కలిసి పనిచేసే అవకాశాలపై మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. “ఏఐ, సెమీకండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్, బయోటెక్, అంతరిక్ష రంగాల్లో భారత్ ఎంతో ధైర్యమైన, ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమాలు చేపట్టింది. జపాన్ సాంకేతికత, భారత ప్రతిభావంతుల మేధస్సు కలిస్తే ఈ శతాబ్దపు సాంకేతిక విప్లవానికి నాయకత్వం వహించవచ్చు” అని మోదీ తెలిపారు. ఈ రెండు దేశాల ఉమ్మడి ప్రయోజనాలు ఉమ్మడి శ్రేయస్సుగా మారాయని, జపాన్ వ్యాపారాలకు భారత్ ఒక మంచి వేదిక అని ఆయన పేర్కొన్నారు.

# కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలి

- మొదటి పేజి తరువాయి
రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కే (ఈడబ్ల్యూఐడీసీ) ఈ బాధ్యతలు అప్పగించాలని ఆయన తేల్చిచెప్పారు.మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పెండింగ్ బిల్లులను గ్రీన్ ఛానెల్ ద్వారా తక్షణమే క్లియర్ చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి జాప్యం జరగకూడదని హెచ్చరించారు. అదేవిధంగా, ‘అమ్మ ఆదర్శ పాఠశాలల’ కింద చేపట్టిన పారిశుద్ధ్య పనుల బకాయిలను కూడా వెంటనే చెల్లించాలని స్పష్టం చేశారు. మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, వంట కోసం సోలార్ ప్యానెళ్లతో కూడిన కంటైనర్ కిచెన్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని పునరుద్ఘాటించిన సీఎం, అవసరమైతే కాంట్రాక్ట్ పద్ధతిలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లను (పీఈటీలు) నియమించుకోవాలని తెలిపారు. సంక్షేమ గురుకులాల్లోని బాలికలకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు మహిళా కౌన్సెలర్లను నియమించడంపైనా సమావేశంలో చర్చించారు. విద్యా రంగంపై చేసే ఖర్చును పెట్టుబడిగా భావించాలని సీఎం అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో 90 శాతానికి పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులే చదువుతున్నందున, గత 10 ఏళ్లలో చదివిన వారి వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు.

## స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. ఫేస్ చేయడానికి నేను రెడీ

- మొదటి పేజి తరువాయి
కాంగ్రెస్ జెండా ఎగరాలనేది తన టార్గెట్ అని చెప్పారు కడియం. ఎవడెవడో ఏదేదో మాట్లాడుతున్నారని. వాటన్నిటికీ మన గెలుపు ద్వారానే సమాధానం చెబుదామని సూచించారు. నియోజకవర్గంలో పాత కొత్త వివాదం వద్దన్నారు. ఎవరైతే గెలుస్తారో వాళ్లే మన హీరోలన్నారు. అక్కడ ఇక్కడ తిరిగి ఆగం కావొద్దని.. అక్కడక్కడ తిరిగి పోస్టులు పెట్టి మీ ఫోటోలు పెట్టొద్దని.. మీరే నష్టపోతారని సూచించారు. ఏం జరిగినా ఘన్ పూర్ నియోజకవర్గంలో తన నుంచే నడుస్తుందని చెప్పారు

**10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు.!**
పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నోటీసులు జారీ చేసినట్టు తెలుస్తోంది. తొలి దశలో ఐదుగురు ఎమ్మెల్యేలకు స్పీకర్ నుంచి నోటీసులు అందినట్టు సమాచారం. వీరిలో కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), దానం నాగేందర్ (ఖైరతాబాద్), తెల్లం వెంకట్రావ్ (భద్రాచలం), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల) , అరెకపుడి గాంధీ (శేరిలింగంపల్లి) ఉన్నారు. మిగతా ఎమ్మెల్యేలకు సైతం త్వరలో స్పీకర్?నోటీసులు ఇవ్వనున్నట్టు తెలుస్తున్నది.
తమ పార్టీ నుంచి గెలిచి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరినందున వారిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు బీఆర్ఎస్ శాసనసభ పక్షం ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై విచారణకు అటెండ్ అయి వివరణ ఇవ్వాలని నోటీసుల్లో స్పీకర్ పేర్కొన్నారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అరెకపుడి గాంధీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ) గూడెం మహిపాల్‌రెడ్డి (పఠాన్ చెరు) సంజయ్ కుమార్ (జగిత్యాల), కాలె యాదయ్య (చేవేళ్ల), ప్రకాశ్‌గౌడ్ (రాజేంద్రనగర్) అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారని స్పీకర్‌కు బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. అయితే, ఈ 10 మంది అసెంబ్లీ రికార్డ్స్ ప్రకారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే ఉన్నామని పలు సందర్భాల్లో ప్రకటించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై 3 నెలల్లో నిర్ణయం తీసుకోవాలని జూలై 25న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుపై న్యాయ నిపుణులతో స్పీకర్ ప్రసాద్ కుమార్, అసెంబ్లీ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు చర్చించినట్టు తెలుస్తున్నది. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు లోపల 10 మంది ఎమ్మెల్యేలతో విచారణ జరిపి.. స్పీకర్ వివరణ తీసుకోనున్నట్టు తెలుస్తున్నది. విచారణ పూర్తి అయ్యాక స్పీకర్ నిర్ణయం తీసుకుంటారా? లేదా పెండింగ్‌లో ఉంచుతారా? అన్నది చర్చనీయాంశంగా మారింది. తనకు స్పీకర్ నుంచి నోటీసులు అందాయని, న్యాయ నిపుణులతో చర్చించి వివరణ ఇస్తానని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వెల్లడించారు.

## తెలంగాణలో బీజేపీ భ్రష్టు పట్టింది

- మొదటి పేజి తరువాయి
తాను అసెంబ్లీకి స్వతంత్ర సభ్యుడిగానే హాజరవుతానని, ఇకపై తనను ఎవరూ కట్టడి చేయలేరని ఆయన స్పష్టం చేశారు.
తెలంగాణలో బీజేపీ పూర్తిగా భ్రష్టుపట్టిపోయిందని రాజాసింగ్ తీవ్రంగా విమర్శించారు. పార్టీలోని కొందరు నేతల వైఖరి వల్లే ఈ దుస్థితి దాపురించిందని, వారి వల్ల పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆరోపించారు. “ఇప్పుడు నాకు ఎవరూ బాస్‌లు లేరు. నన్ను ఎవరూ అదుపు చేయలేరు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం దొరికింది” అని రాజాసింగ్ అన్నారు.తానుగా మళ్లీ బీజేపీలో చేరే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. కేవలం పార్టీ జాతీయ నాయకత్వం నుంచి పిలుపు వస్తేనే తిరిగి చేరికపై ఆలోచిస్తానని చెప్పారు. రాజాసింగ్ చేసిన ఈ వ్యాఖ్యలు అసెంబ్లీ సమావేశాల ముందు బీజేపీలో కలకలం రేపాయి.

## కారు పార్టీకి కాళేశ్వర కష్టం.. ముందు నుయ్యి వెనుక గొయ్యి.. అసెంబ్లీకి కేసీఆర్ డుమ్మా కొట్టే ఛాన్స్..

- మొదటి పేజి తరువాయి
కాళేశ్వరం నివేదిక ను సభలో ప్రవే శపెట్టనుంది. తాను గజ్వేల్ ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి కేవలం రెండు సార్లు మాత్రమే కేసీఆర్ సభకు హాజరయ్యారు. ఆ రెండు కూడా బడ్జెట్ సెషన్స్ కావడం గమ నార్హం. రేపటి మీటింగ్ ప్రధానంగా కాళేశ్వరం కమిటీ నివేదికపైనే జరగనున్నందున కేసీఆర్ హాజరు హాట్ టాపిక్ గా మారింది. కేసీఆర్ హాజరైతే అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం కమిషన్ నివేదికను వినిపించడంతోపాటు లోపాలను, డిజైనింగ్, ఇంజినీరింగ్ వైఫల్యాలను ఎండగ ట్టనుంది. దీంతో ఆయన డిఫెన్స్ లో పడిపోయే ప్రమాదం ఉందనే వాదన ప్రభుత్వం వైపు నుంచి ఉంది. గైర్హాజరయితే అవకతవకలపై సమాధానం చెప్పలేకే ముఖం చాటేశారంటూ హైకోర్టుకు ప్రభుత్వం నివేదించనుంది. ఈ పరి స్థితిని ముందుగానే ఊహించిన కేసీఆర్ అసెంబ్లీకి హాజరయ్యే అవకాశాలు కనుచూపు మేరలో కూడా కనిపించడం లేదు. కాళేశ్వరం నివేదిక పై అసెంబ్లీలో చర్చ జరుగుతుండగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గొడవ చేస్తే చర్చ జరగనీయకుండా అడ్డుపడ్డారని తెలుపుతూ హైకోర్టుకు సర్కారు నివేదించే అవకాశం ఉంది. దీంతో పాటు ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్ కింద వీడియోలను కూడా న్యాయస్థానానికి అందించనుంది.

**అన్ని వేళ్లు కేసీఆర్ వైపే**
కాళేశ్వరంపై ఘోష్ కమిషన్ 600 పేజీల నివేదికను సమర్పించింది. ఇందులో 60 పేజీలకు బ్రీఫ్ చేసి మరో నివేదికను కూడా అధికారులతో కూడిన కమిటీ సిద్ధం చేసినట్టు సమాచారం. ప్రధానంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి డిజైనింగ్, ఇంజినీరింగ్, నిర్మాణ లోపాలున్నాయని నివేదికలో పే ర్కొన్నట్టు సమాచారం. తానే డిజైన్ చేసి నట్టు ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పుడు పదే పదే చెప్పిన కేసీఆర్.. కమిషన్ ముందు మాత్రం తప్పును ఇంజినీర్ల మీదకు నెట్టేశా రు. దీంతో కథ మొత్తం మారిపోయింది. అటు ఇంజినీర్లు మాత్రం అంతా కేసీఆర్ చెప్పినట్టే చేశామని అఫిడవిట్లు ఇవ్వడంతో పాటు కమిషన్ కు వాంగ్మూలాలు కూడా ఇచ్చారు. ఎన్డీఎస్ఏ, విజిలెన్స్ నివేదికలు, నిర్మాణ సంస్థలు, ఇంజినీర్లను విచారించి కమిషన్ ఈ నివేదికను సిద్ధం చేసింది. ఈ క్రమంలో అన్ని వేళ్లూ కేసీఆర్ వైపే చూపి స్తున్నాయి. వీటికి సమాధానం చెప్పుకొనేం దుకైనా కేసీఆర్ సభకు హాజరు కావాల్సి ఉంది. అయితే ఆయన వచ్చి కమిషన్ రిపోర్టును విభేదించాలి. డిజైనింగ్ ను. ఇంజినీరింగ్ ను, నిర్మాణ నాణ్యతను సమ ర్థించుకోవాల్సి ఉంటుంది. ఈ తరుణంలో కాళేశ్వరం కమిషన్ నివేదిక లోపాలను ఎత్తి చూపాలి. కాళేశ్వరం ప్రాజెక్టుకు కర్త, కర్మ, క్రియ అయిన కేసీఆర్ అసెంబ్లీకి హాజరయ్యే అవకాశాలు దాదాపుగా లేవనే చెప్పాలి. అందుకే ఆ బాధ్యతను హరీశ్ కు అప్పగించారు. దీంతో అసెంబ్లీ వేదికగా ఏం జరగబోతోంది..? బీఆర్ఎస్ ఎలా ఎదుర్కోబోతోందనేది హాట్ టాపిక్ గా మారింది.

## నాకు పార్టీలతో పని లేదు.. మీకోసం పనిచేస్తా

- మొదటి పేజి తరువాయి
రాజగోపాల్ రెడ్డి.. భూమి కోల్పోతున్న రైతులకు మంచి రేటు ఇపించే ప్రయత్నిస్తానని చెప్పారు. మరోసారి ట్రిపుల్ అలైన్ మెంట్ గురించి అధికారులుతో చర్చిస్తానని తెలిపారు. రేపు అసెంబ్లీలో ముఖ్యమంతితో మాట్లాడి ట్రిపుల్ ఆర్ రైతుల సమస్యను తెలియజేస్తానని చెప్పారు. తాను మునుగొడు ప్రజల అందరికీ ఎమ్మెల్యేనని.. తనతో కాకుంటే ఇంకెవరితోనూ ఈ పని కాదన్నారు. తనకు పార్టీలతో పని లేదని.. ప్రభుత్వంతో మాట్లాడి మీ సమస్య తీర్చేందుకు ప్రయత్నం చేస్తానని రాజగోపాల్ రెడ్డి అన్నారు.

## తహసీల్దార్ నివాసంలో ఏసీబీ సోదాలు.. రూ.కోట్ల విలువైన ఆస్తులు గుర్తింపు

- మొదటి పేజి తరువాయి
ఆయన నివాసంతో పాటు బంధువుల ఇళ్లలోనూ ఏకకాలంలో ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బందాలు తనిఖీలు నిర్వహించాయి. ఉదయం నుంచి సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులు దాదాపు రూ.5కోట్ల విలువైన ఆస్తులను గుర్తించినట్టు సమాచారం. రూ.1.15 కోట్ల విలువైన ఇంటి పత్రాలు, రూ.1.42 కోట్ల విలువైన 17.10 ఎకరాల వ్యవసాయ భూమి, రూ.23.84లక్షల విలువైన 70 తులాల బంగారం, రూ.92వేల విలువైన 1,791 గ్రాముల వెండి వస్తువులు, రూ.34.78 లక్షల విలువైన 6 వాహనాలు, రూ.3.28 లక్షల విలువైన చేతి గడియారాలు, రూ.16.43 లక్షల విలువైన గృహోపకరణాలను గుర్తించారు. హనుమకొండ జిల్లాలోని హసన్‌పర్తి, ధర్మసాగర్, కాజీపేట మండలాల్లో కూడా నాగేశ్వరరావు గతంలో తహసీల్దార్‌గా పనిచేశారు.

## పెద్దపల్లి జిల్లాలో ఆకట్టుకుంటున్న కరెన్సీ గణపతి.. 9,99,999 నోట్లతో అలంకరించిన నిర్వాహకులు

- మొదటి పేజి తరువాయి
పట్టణం లోని ఆర్యవైశ్య భవన్ లో కరెన్సీ నోట్లతో అలంకరించిన గణపతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఆర్యవైశ్యల ఆధ్వర్యంలో గణనాధుడికి 9,99,999 కరెన్సీ నోట్లతో అలంకరించారు నిర్వాహకులు. గత కొన్ని సంవత్సరాలుగా ఇలా గణనాధుడికి కరెన్సీ నోట్లతో అలంకరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొమ్మిది లక్షల 99 వేల 999 రూపాయల కరెన్సీ నోట్లతో అలంకరించగా భక్తులను ఎంతగానో ఆకట్టుకుందని తెలిపారు. ఈ కరెన్సీ అలంకరణ లో 500 , 100, 50, 20, 10 రూపాయల నోట్లతో అలంకరించారు నిర్వాహకులు. సుల్తానాబాద్ లో కరెన్సీ గణపతి ఇదొక స్పెషల్ అట్రాక్ట్ గా నిలిచింది. కరెన్సీతో అలంకరించిన గణేశుని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున మండపానికి చేరుకున్నారు

## రామసేతుకు జాతీయ హెూదా కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు

రామసేతువును జాతీయ వారసత్వ కట్టడంగా ప్రకటించాలన్న డిమాండ్‌పై సుప్రీంకోర్టు కీలక ముందడుగు వేసింది. ఈ అంశంపై బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్యస్వామి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. నిర్దిష్ట సమయంలోగా దీనిపై నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ స్వామి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు.
జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) డైరెక్టర్, ఏఎస్ఐ తమిళనాడు ప్రాంతీయ డైరెక్టర్ ఈ నోటీసులకు సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. స్వామి తరఫున సీనియర్ న్యాయవాది విభా దత్తా మఖిజా, న్యాయవాది సత్య సబర్వాల్ వాదనలు వినిపించారు.రామసేతువును జాతీయ స్మారక చిహ్నంగా ప్రకటించే విషయంలో తన విజ్ఞప్తిపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సుబ్రహ్మణ్యస్వామి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. రామసేతువుకు సంబంధించిన మతపరమైన, చారిత్రక ప్రాముఖ్యతను గుర్తించి, దాని పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరుతున్నారు. ఈ విషయంపై గత ఏడాది జనవరిలోనే సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ప్రభుత్వానికి మరిన్ని పత్రాలు సమర్పించేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో, మే 13న మళ్లీ కేంద్ర సాంస్కృతిక మంత్రికి విజ్ఞప్తి చేసి, తాజాగా సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ వేశారు.

## రుషికొండ భవనాల వినియోగంపై ఏపీ ప్రభుత్వం దృష్టి

- మొదటి పేజి తరువాయి
కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేశారు.పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న భవనాలను సముచితంగా వినియోగించే మార్గాలను అన్వేషించి, తగిన సిఫార్సులు ప్రభుత్వానికి అందజేయాలని కమిటీకి సూచించారు.ఖ

# భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

**గిద్దలూరు శాసనసభ సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డిని కలిసిన భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు.**



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 29**

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును గత ప్రభుత్వం నిలుపుదల చేస్తూ మెమో నెంబర్ 12 14 తీసుకురావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలు ఆగిపోయినాయని ఆ మెమోను రద్దుచేసి భవననిర్మాణ కార్మిక సంక్షేబోర్డు పథకాలు పునరుద్ధరించాలని గిద్దలూరు శాసనసభ సభ్యులు ముత్తమల అశోక్ రెడ్డిని శుక్రవారం భవనిర్మాణ కార్మిక సంఘం నాయకులు కలిసి వినపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శాసనసభ సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భవనిర్మాణ కార్మికులను మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం కార్మికుల పక్షాన ఉంటుందన్నారు. ఏదైతే గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నుండి అమలవుతున్న సంక్షేమ పథకాలను రద్దు చేస్తూ తీసుకువచ్చిన మెమోను 12 14 రద్దు చేయాలని కోరుతూ అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ విషయం పై ముఖ్యమంత్రి కి విద్యాశాఖ మంత్రి, కార్మిక శాఖ మంత్రి దృష్టికి సమస్యను తీసుకు పోతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో భవనిర్మాణ కార్మిక సంఘం నాయకులు టి ఆవులయ్య, నరసింహులు, ఎం నారాయణ, ఆబెల్, థామస్, ఎం భాస్కర్, సిహెచ్ రాంబాబు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నేడే పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 29**



గిద్దలూరు పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం 11:00 గంటలకు పురపాలక సంఘ సమావేశం హాల్లో చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య అధ్యక్షతన నిర్వహించనున్నట్లు. ఈ సమావేశములో శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి హాజరు కానున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఈ వి రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసమావేశంలో కౌన్సిలర్లు , మున్సిపల్ అధికారులు పాల్గొని సమావేశం జయప్రదం చేయాలని కోరారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

**ముస్లిం యూత్ సొసైటీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 85మంది రక్తదాన కార్యక్రమం**







**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెనపవర్ ఆగష్టు 29**

మనిషి జీవితంలో ప్రాణవాయువు ఎంత అవసరమో రక్తం అంతే అవసరమని,రక్తం విలువ వెలకట్టలేనిదని రక్తదానం ప్రాణదానంతో సమానమని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం ముస్లిం యూత్ సొసైటీ కార్యాలయంలో సొసైటీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మెగా రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని, రక్తదానం చేయడం వల్ల చేసిన వారు కూడా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు.మౌలానా హీదాయతుల్లా మాట్లాడుతూ మనిషి శరీరంలో అయిదు నుండి ఆరు లీటర్ల రక్తం ఉంటుందని, అందులోనుండి 350మిల్లి లీటర్ల రక్తం ఏడాదిలో కనీసం మూడు సార్లు ఇవ్వవచ్చుఅని అన్నారు.ఈ రక్తదాన శిభిరాన్ని వినుకొండ ఆపద్ బందు బ్లడ్ బ్యాంకుసారథ్యంలో నిర్వహించగా 85మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలోమొగల్ కరిముల్లా బేగ్,మౌలానా మహమ్మద్ హుస్సేన్,మౌలానా జుబేర్, సీనియర్ పాత్రికేయులు వలి సాహెబ్, జిల్లా కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సాబీర్ భాష, సయ్యద్ జబివుల్లా, షేక్ వలి షేక్ హనీఫ్ అఖిల్,ముస్లిం మైనార్టీ నాయకులు సత్తార్ సభ్యులు పాల్గొన్నారు.

# భావితరాలకు తెలుగు భాష తియ్యదనాన్ని అందించాల్సిన భాధ్యత మనపై ఉంది

**పాలలో ఉన్న స్వచ్ఛత, తేనెలో ఉన్న మాధుర్యము కలగలిపిన పదజాలమే "తెలుగు భాష".**
**మనదేశంలో అతి ప్రాచీన భాషల్లో తెలుగు భాష ఒకటి**
**ప్రపంచవ్యాప్తంగా 18 కోట్ల మంది మాట్లాడే భాష తెలుగు భాష.**
**దేశ భాషల యందు తెలుగు లెస్స అని కన్నడ ప్రభువు శ్రీకృష్ణదేవరాయలు తెలుగు భాష కీర్తిని హిమాలయ శిఖరాగ్రాన నిలిపాడు.**
**జనవిజ్ఞాన వేదిక రాష్ట్రనాయకులు పి.స్వరూపరెడ్డి**





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 29**

మనిషి నుండి పుట్టినభాష..... కేవలం మాటల వారధి మాత్రమే కాదు. మన మూలాలను తెలియచెప్పి ముందుకు నడిపే సారధి మాతృభాష ఏదైనా.. అది తల్లితో సమానం. తల్లిపాలకు ప్రత్యావ న్నయము లేనట్లే.. అమ్మ భాషకు ప్రత్యామ్నాయం లేదు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఉపాధి కోసం నేర్చుకోవలసి వచ్చిన ఆంగ్లభాష.. స్థానికతను, ఉనికిని మాతృభాషను మింగేసే స్థాయికి చేరింది. ప్రజలు కార్పొరేట్ స్కూల్లో మాయలో పడి సాఫ్ట్ వేర్ ఉద్యోగాల సౌదాలలో చిక్కి అటు మాతృభాష.. ఇటు ఆంగ్లభాష ఏది సరిగా నేర్చుకోలేని దుస్థితి నుండి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. గిడుగు వారి వారసత్వాన్ని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత మనదేనని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పి .స్వరూపరెడ్డి పేర్కొన్నారు శుక్రవారం గిడుగు రామ్మూర్తి జయంతి సందర్బంగా స్పందన విద్యాసంస్థల్లో ఏర్పాటుచేసినకార్యక్రంలో పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుతం తెలుగులో మాట్లాడం అంటే నామోషీగా భావించే వారి సంఖ్య ఎక్కువ అవుతోందని. మాతృభాష బాగా వస్తేనే, ఏ ఇతర భాష అయినా బాగా నేర్చుకోవచ్చని వివిధ అధ్యయనాలు చెబుతున్నాయన్నారు. ఈ విషయాన్ని గిడుగు వంటి మహనీయులు ఋజువు చేశారని.తెలుగు అజంత భాష. అనగా దాదాపు ప్రతి పదం ఒక అచ్చుతో అంతం అవుతుందని. దీన్ని గమనించే 15వ శతాబ్దంలో ఇటాలియన్ యాత్రికుడు నికొలో డి కాంటి తెలుగుని ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ (ప్రాచ్య ఇటాలియన్) గా అభివర్ణించారని పేర్కొన్నారు. భాష ఉండేది ప్రధానంగా భావ వ్యక్తీకరణ కోసం మాత్రమే.గిడుగు ఉద్యమంవల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యావహారికభాషలో సాగి, అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. పండితులకే పరిమితమైన సాహిత్యసృష్టి, సృజనాత్మకశక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ వీలైందనితెలిపారు. గిడుగు వెంకట రామమూర్తి 1863 ఆగష్టు 29 వ తేదీ శ్రీకాకుళానికి ఉత్తరాన ఇరవైమైళ్ళ దూరంలో ముఖలింగ క్షేత్రం దగ్గర ఉన్న పర్వతాలపేట అనే గ్రామంలో జన్మించాడని. అతని తండ్రి వీర్రాజు, తల్లి వెంకమ్మ. వీర్రాజు పర్వతాలపేట ఠాణాలో సముద్దారు (రివెన్యూ అధికారి) గా పనిచేస్తుండేవాడని. 1875దాకా ప్రాథమిక విద్య ఆ ఊళ్ళోనే సాగిందని. తండ్రి చోడవరంబదిలీ అయి అక్కడే విషజ్వరంతో 1875 లోనే చనిపోయాడని. విజయనగరంలో మేనమామగారి ఇంట్లో ఉంటూ రామమూర్తి మహారాజావారి ఇంగ్లీషు పాఠశాలలో ప్రవేశించి 1875 మొదలు 1880 వరకు విజయనగరంలో గడిపాడన్నారు. 1879 లో మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడని. ఆ రోజుల్లో గురజాడ అప్పారావు రామమూర్తికి సహాధ్యాయి. ఆ ఏడే రామమూర్తికి పెండ్లి అయిందన్నారు. 1880లో ముప్ఫై రూపాయల జీతం మీద పర్లాకిమిడి రాజావారి స్కూల్లో ఫస్టుఫారంలో చరిత్ర బోధించే అధ్యాపకుడై. సంసారబాధ్యత (తల్లి, ఇద్దరు చెల్లెళ్ళు) రామమూర్తి పై బడిందని. ప్రైవేటుగా చదివి 1886 లో ఎఫ్.ఏ., 1894 లో బి.ఏ. మొదటి రెండు భాగాలు (చరిత్ర తప్ప) ప్యాసయ్యాడు. 1896 లో మూడోభాగం ప్యాసై పట్టం పుచ్చుకున్నాడు. ఇంగ్లీషు, సంస్కృతాలు గాక, ప్రధాన పాఠ్యాంశంగా చరిత్ర తీసుకుని రాష్ట్రంలో మొదటి తరగతిలో, రెండోర్యాంకులో ఉత్తీర్ణుడయ్యాడన్నారు. రాజావారి ఉన్నత పాఠశాల ,కళాశాల అయిందని. అప్పుడు అతనికి కళాశాల తరగతులకు పాఠాలు చెప్పే యోగ్యత వచ్చిందని పేర్కొన్నారు. ఆరోజుల్లోనే అతనికి దగ్గర అడవుల్లో ఉండే సవర ల భాష నేర్చుకొని వాళ్ళకు చదువు చెప్పాలనే కోరిక కలిగిందని. తెలుగు, సవరభాషలు రెండూ వచ్చిన ఒక సవర వ్యవహర్తను ఇంట్లోనే పెట్టుకొని సవర భాష నేర్చుకున్నాడన్నారు. ఈ పరిశ్రమ చాలా ఏళ్ళు జరిగిందని. సవరభాషలో పుస్తకాలు వ్రాసి సొంతడబ్బుతో స్కూళ్ళు పెట్టి అధ్యాపకుల జీతాలు చెల్లించి సవరలకు వాళ్ళ భాషలోనే చదువు చెప్పే ఏర్పాట్లు చేశాడని. మద్రాసు ప్రభుత్వం వారు ఈ కృషికి మెచ్చి 1913 లో "రావు బహదూర్" బిరుదు ఇచ్చారన్నారు. భాషాశాస్త్రంలో అప్పుడప్పుడే వస్తున్న పుస్తకాలు చదివి వ్యాకరణనిర్మాణ విధానం నేర్చుకొన్నాడని. ముప్ఫై అయిదేళ్ళ కృషితో 1931 లో ఇంగ్లీషులో సవరభాషా వ్యాకరణాన్ని, 1936 లో సవర-ఇంగ్లీషు కోశాన్ని నిర్మించాడని తెలిపారు. రామమూర్తికి చిన్నప్పటినుంచి విద్యాసక్తి, కార్యదీక్ష, సత్యాన్వేషణం ప్రధాన లక్షణాలు. సవరలు, హరిజనులు అంటరాని జనాలని అప్పటి సంఘం అంటుంటే ఆ కాలంలోనే, అతను సవర విద్యార్థులకు తన ఇంట్లోనే బస ఏర్పరచి, భోజనం పెట్టేవాడని. 1907లో యోట్స్ అనే ఇంగ్లీషుదొర ఉత్తర కోస్తా జిల్లాలకు స్కూళ్ళ ఇన్స్పెక్టర్‌గా వచ్చాడని. చిన్న తరగతుల్లో తెలుగు పండితులు పాఠాలు చెప్పే పద్ధతి ఆ దొరకు అర్థం కాలేదు. ప్రజలు వ్యవహరించే భాష, పుస్తకాల భాష మధ్య ఎందుకు తేడాలు ఉన్నాయి అన్నది అతని ముఖ్య సమస్య. అంతకు ముందు తమిళదేశంలోనూ అదే సమస్య అతనిని వేధించిందని. విశాఖపట్నంలో ఉన్న పి.టి. శ్రీనివాస అయ్యంగారిని అడిగితే ఆయన గురజాడ, గిడుగులు దీనికి సమాధానం చెబుతారని అన్నాడని. . 1906 నుండి 1940 వరకు గిడుగు రామమూర్తి కృషి అంతా తెలుగు భాషా సేవకే. 1919 లో గిడుగు "తెలుగు" అనే మాసపత్రికను స్థాపించి తన శాస్త్రీయ వ్యాసాలతో, ఉపన్యాస పాఠాలతో అవిశ్రాంతంగా పోరాటం సాగించాడన్నారు. గిడుగు వారి మాటల్లో "దేశభాష ద్వారా విద్యబోధిస్తేకానిప్రయోజనంలేదని. శిష్టజనవ్యావహారికభాష లోకంలో సదా వినబడుతూంటుందన్నారు. అది జీవంతో కళకళలాడుతూ ఉంటుందని. గ్రాంథికభాష గ్రంథాలలో కనబడేదే కాని వినబడేది కాదన్నారు. ప్రతిమ వంటిది. ప్రసంగాలలో గ్రాంథికభాష ప్రయోగిస్తూ తిట్టుకొన్నా, సరసాలాడుకున్నా ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో చూడండి. గ్రాంథికభాష యెడల నాకు ఆదరము లేకపోలేదు. ప్రాచీనకావ్యాలు చదువవద్దనీ విద్యార్థులకు నేర్పవద్దనీ నేనను. కాని ఆ భాషలో నేడు రచన సాగించడానికి పూనుకోవడం వృథా అంటున్నాను. నిర్దుష్టంగా ఎవరున్ను వ్రాయలేరు. వ్రాసినా వ్రాసేవారికి కష్టమే వినేవారికి కష్టమే. వ్రాసేవాండ్లేమి చేస్తున్నారు? భావం తమ సొంత (వాడుక) భాషలో రచించుకొని గ్రాంథికీకరణం చేస్తున్నారు. అది చదివేవాండ్లు, వినేవాండ్లు తమ సొంత వాడుకమాటలలోకి మార్చుకొని అర్థం చేసుకొంటున్నారన్నారు. ఎందుకీ వృథాప్రయాస?. స్వరాజ్యం కావలెనంటున్నాము. ప్రత్యేకాంధ్రరాష్ట్రము కోసం చిక్కుపడుతున్నాము. ప్రజాస్వామిక పరిపాలనం కోరుచున్నాము. ఇటువంటి పరిస్థితులలో మన ప్రజలకు, సామాన్య జనులకు ఏభాష ద్వారా జ్ఞానం కలుగచేయవలసి ఉంటుందో, ఏ భాషలో గ్రంథరచన సాగించవలసి ఉంటుందో ఆలోచించండి. మీచేతులలో పత్రికలున్నవి. పత్రికల ద్వారా మీరు ఎంతైనా చేయగలరు". గిడుగు రామమూర్తి , జనవరి 22, 1940 న తుదిశ్వాస విడిచారు.తెలుగు భాష కోసం ఎనలేని కృషి చేసాడు.వ్యవహారిక భాషను తెచ్చి సుందరమైన భాషను కానుకగా ఇచ్చిన గిడుగు రామమూర్తి తెలుగు భాష ఉన్నంత కాలం తెలుగు వాళ్ల మనుషులో చిరకాలం నిలిచిపోతాడన్నారు.

ప్రస్తుతం తెలుగులో మాట్లాడంటే నామోషీగా భావించే వారి సంఖ్య ఎక్కువ అవుతోందని. మాతృభాష బాగా వస్తేనే, ఏ ఇతర భాష అయినా బాగా నేర్చుకోవచ్చని వివిధ అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ విషయాన్ని గిడుగు వంటి మహనీయులు ఋజువు చేశారని తెలుగు భాషను సామాన్యులకు చేరువ చేసిన ఘనత గిడుగుకు దక్కుతుంది. అందుకే ఆయనను వ్యవహారిక భాషా పిత అని పిలుస్తారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో తెలుగు మాధ్యమంకనుమరుగయింది. ఇంగ్లీష్ అవసరమే. అదే సమయంలో తెలుగు భాషను నిర్లక్ష్యం చేయకూడదు. కనీసం ఐదవ తరగతి వరకు మాతృ భాషలో బోధన ఉండాలి. తెలుగు మహా సభలను ప్రతి ఏటా నిర్వహించాలి. తెలుగు రచయితలను ప్రోత్సహించాలి.ఈ విషయంలో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలను తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవాలి. అదే విధంగా మాండలికాలను గౌరవించాలి.అప్పుడే తెలుగు భాషకు నిజమైన వెలుగు వస్తుందని పేర్కొన్నారు.

# మద్దిపాడు మండలంలో జాయింట్ కలెక్టర్ విస్తృత పర్యటన



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఆగష్టు 29**

శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ మద్దిపాడు మండలంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల క్రిష్ణ మద్దిపాడు మండలం, సీతారామపురం గ్రామాన్ని సందర్శించి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ను తనిఖీ చేశారు. కాలుష్యం తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని బంక్ యజమానులకు తెలియజేశారు. ఈ తనిఖీల్లో భాగంగా ట్యాంకుల్లో నిల్వ ఉంచిన పెట్రోల్, డీజిల్ నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. పెట్రోల్ బంక్ లో గాలి, నీరు, బాత్ రూమ్ తదితర ఏర్పాట్లును పరిశీలించారు. తదుపరి మద్దిపాడు మండల కేంద్రంలో గల రేషన్ షాప్ ను సందర్శించి రేషన్ స్టాక్ రిజిస్టర్స్ ను బియ్యం నాణ్యతను, స్టాక్ ను పరిశీలించారు.ఈ సందర్భంగా 65 సంవత్సరాలు పైబడిన వారికి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయడంలో భాగంగా పిన్నిటి నారాయణమ్మ (79 సంవత్సరాలు) ఇంటికి జాయింట్ కలెక్టర్ గోపాల క్రిష్ణ వెళ్లి రేషన్ ను అందజేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ వెల్లంపల్లి గ్రామంలో పర్యటించి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి తో కలసి నందిని ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువులు, పురుగు మందుల స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఎరువులు అమ్మే విధానంను జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. నకిలీ ఎరువులు, పురుగు మందులు పై ప్రత్యేక నిఘా పెట్టాలని, అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఎరువులను అధిక ధరలకు అమ్మే వారిపై, అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్ చేసేవారిపై కేసులు నమోదు చేయాలని ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఎరువులు, పురమందుల నిల్వలను తెలియజేస్తూ రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని ఎరువుల దుకాణం దారులకు సూచించారు. అనంతరం జెఎంఆర్ సినిమా దియేటర్ ను తనిఖీ చేసి ప్రేక్షకులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాస రావు, మండల అధికారులు పాల్గొన్నారు.



# క్విస్ కళాశాలలో ఉత్సాహంగా జాతీయ క్రీడా దినోత్సవం





**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఆగష్టు 29**

హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురసరించుకొని ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం శుక్రవారం ఉత్సాహంగా జరిగింది. క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్ బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించారు. విజేతకు కళాశాల యాజమాన్యం ప్రోత్సాహకాలు అందజేసింది. ఈ సందర్భంగా కళాశాలలోని క్రీడాకారులు ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడాకారులంతా ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేశారు. దేశంలోని ఎంతోమంది క్రీడాకారులకి ధ్యాన్ చంద్ స్ఫూర్తి అని ఆయన్ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని దేశానికి పతకాలు సాధించేంత ఎత్తుకు ఎదగాలని క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి అన్నారు. క్విస్ విద్యాసంస్థల్లో క్రీడలకు ఎప్పుడూ ప్రాధాన్యత ఉంటుందని, ఎంతోమంది విద్యార్థులు క్రీడల్లో రానిస్తున్నారని క్విస్ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి అన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాలేజి యాజమాన్యం గిడుగు వెంకట రామ్మూర్తి గారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు, ఫిజికల్ డైరెక్టరీ విభాగానికి చెందిన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యావహారిక భాషోద్యమ వైతాళికుడు గిడుగు

## - ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య







**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఆగస్టు 29**

ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో గిడుగు రామమూర్తి పంతులు 162జయంతిని, తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జి.వి.శివారెడ్డి మాట్లాడుతూ వ్యావహారిక భాషా ఉద్యమ పితామహుడు గా ప్రసిద్ధి గాంచిన గొప్ప సాహితీవేత్త,సాహిత్య వ్యాసంగంలోనూ, నూతన విద్యా రంగంలోనూ, గ్రాంథిక భాషను వాడకుండా వ్యవహారిక భాషను వాడాలన్న మహోద్యమానికి ప్రాణం పోసిన వాడు గిడుగు అని పేర్కొన్నారు. ముందుగా స్థానిక కర్నూల్ రోడ్డు జంక్షన్ వద్ద ఉన్న తెలుగు తల్లి విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించి,పూలాభిషేకం చేసి తదుపరి కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న ఎర్రన, జాషువా విగ్రహాలను పూలమాలలతో అలంకరించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నారాయణ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని తెలుగు తల్లికి పూలమాలలతో అలంకరించారు.సాయంత్రం జరిగిన సభకు సంస్థ అధ్యక్షులు డా నూనె అంకమ్మరావు అధ్యక్షత వహించగా, కార్యదర్శి కుర్రా ప్రసాద్ బాబు సభా నిర్వహణ చేశారు. ఈసభలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ వాడుక భాషోద్యమానికి సారధ్యం వహించి, వాడుక భాషలోనే ప్రజల వ్యవహారాలన్నీ జరగాలని, దాన్ని లక్ష్యంగా చేసుకుని, దానికోసం గ్రాంథిక భాషావాదులతో తగవులు పడి చివరకు విజయాన్ని సాధించిన వైతాళికుడు గిడుగు అని పలువురు వక్తలు అన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ, సంస్థ అధ్యక్షులు డా.నూనె అంకమ్మరావు, కార్యదర్శి కుర్రాప్రసాద్ బాబు, విశిష్ట అతిథిగా హాజరైన జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాళహస్తి సంపూర్ణ, ప్రముఖ కవి నన్నపనేని రవి, మిడసల మల్లికార్జున రావు, తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈకార్యక్రమానికి కె.బాలకోటయ్య,సిహెచ్ కోటేశ్వరరావు , బీరం అరుణ, ఓరుగంటి ప్రసాద్ తదితరులు నిర్వహణ సహకారాన్ని అందించగా పి.గోవర్ధన్ రెడ్డి,ధేనువకొండ సుబ్బారావు , అంగలకుర్తి ప్రసాద్, యం.సూర్యకళ , నాళం నరసమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కవిసమ్మేళనంలో కవయిత్రులు వి.ఝాన్సీదుర్గ , పరాంకుశం కృష్ణవేణి, శ్రీరామచంద్రుని లక్ష్మి ,జంధ్యాల కామేశ్వరి, బీరం అరుణ ,బండారు సునీత , ఎన్.లక్ష్మీనాంచారమ్మ,జి.పద్మజాతోపాటు కవులు యు.వి.రత్నం, పిన్ని వెంకటేశ్వర్లు, కప్పగంతు జయరామయ్య,కెయస్వీ ప్రసాద్ ,, చుండూరు శ్రీనివాసరావు, డి.వి.ఎస్.రామాచార్యులు,యన్.శ్రీనివాస్ ప్రసాద్ ,షేక్ సంధాని,కందుల మధు తదితరులు పాల్గొని తెలుగు భాష గొప్పతనాన్ని గురించి కీర్తించారు.అనంతరం కవులందర్నీ సంస్థ పక్షాన ఘనంగా సత్కరించారు.


# గిద్దలూరు బిసి సహాయ సంక్షేమాధికారిగా దమ్మాల హరి ప్రసాద్

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 29**



గిద్దలూరు బిసి సహాయ సంక్షేమాధికారిగా దమ్మాల హరి ప్రసాద్‌ను నియమిస్తూ డైరెక్టర్ బిసి వెల్ఫేర్ విజయవాడ ఉత్తర్వులు ఈనెల 28 జారీ చేశారు. ఇంతవరకు గిద్దలూరు బిసి సహాయ సంక్షేమాధికారి గా మార్కాపురం ఏబీసీడబ్ల్యూ ఖాసీం ఇన్చార్జిగా వ్యవహారిస్తున్నారు. ఆస్థానంలో కోమరోలు బిసి హాస్టల్ వసతిగృహ సంక్షేమాధికారిగా పనిచేస్తున్న దమ్మాల హరి ప్రసాద్ కు పదోన్నతి కల్పించి గిద్దలూరు ఏబీసీడబ్ల్యూ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. . హరిప్రసాద్ 1991 లో బిసి వెల్ఫే ర్ లో వేటపాలెంలో ఉద్యోగంలో చేరారు. డిపార్ట్మెంట్ పరిక్షాలన్నీ ఉత్తీర్ణత పొందారు. వార్డెన్ గా చేరిన హరిప్రసాద్ , పలుప్రాంతాలో పనిచేసి సెహభాష్ అనిపించుకున్నారు. పలుమార్లు ఉత్తమ వార్డెన్ గా పలువురు మంత్రుల , అధికారులనుండి ప్రశంషా పత్రాల ను పొందారు. ఈ ఏడాదికూడా స్వాతంత్ర్య వేడుకల సందర్బంగా ఉత్తమ అవార్డు పొందారు. ఎక్కడ పనిచేసిన తనదైన ముద్రవేసి పనిచేసిన ప్రాంతాల్లో ప్రశంశల పొందారు. ఏబీసీడబ్ల్యూ గా పదోన్నతి పొందిన హరి ప్రసాద్ సెప్టెంబర్ 1 న విధుల్లో చేరనున్నట్లు తెలిసింది.

# పొదిలిలో అట్టహాసంగా వినాయక విగ్రహాల నిమజ్జనాలు



**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 29**

పొదిలిలో వినాయక విగ్రహాల నిమజ్జనం కార్యక్రమాలు ఎంతో అట్టహాసంగా జరుగుతున్నాయి. వినాయక చవితి వేడుకల్లో భాగంగా జరుగుతున్న వినాయక విగ్రహాల నిమజ్జనాలు ఎంతో అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం నాడు పొదిలిలో పలు వినాయక విగ్రహాల నిమజ్జనాలు జరిగాయి. స్థానిక దర్శి రోడ్డు లోని ఆర్టీసీ ప్రాంగణంలో సిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని ఎంతో ఆనందోత్సవాల మధ్య నిమజ్జనానికి తరలించారు. ఏలూరు సాయి, ఆకుపాటి శ్రీకాంత్ ల ఆధ్వర్యంలో జరిగిన వినాయక నిమజ్జన కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ కుమార్, ఆయన సోదరుడు వరికుంట్ల నిరంజన్ లు పాల్గొని పూజలు జరిపారు. అలాగే వినాయక చవితి వేడుకలకు సహకరించిన వారికి టీ షర్టులు, ఆర్థిక సాయం అందజేశారు. వినాయక నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు తమకు అన్ని విధాల సహకరించిన వరికుంట్ల అనిల్, ఆయన సోదరులు నిరంజన్ లను కమిటీ సభ్యులు పూలదండలతో సత్కరించి తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

# దర్జాగా రోడ్డు కబ్జా ఆపైన బెదిరింపులు

## - బరితెగించిన ఆక్రమణ దారుడు

## - ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో 30 అడుగుల రోడ్డు ఆక్రమణ





**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ ఆగస్టు 29**

ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో ఓ ఇండస్ట్రీ యజమాని 30 అడుగుల రోడ్డు ఆక్రమించిన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే సంతనూతలపాడు ఇలాకా పేర్నమిట్ట గ్రామ సర్వే నంబర్ 95 /1 బి లో ఏడు ఎకరాల 94 సెంట్లు లే అవుట్ ఏర్పాటు చేయడం జరిగినది. అందులో 11 వ నంబర్ ప్లాట్ 30 గదులు యన్నం రమాదేవి కొనుగోలు చేశారు. ఆ స్థలం నందు జిల్లా పరిశ్రమల శాఖ నుండి అనుమతి పొంది పరిశ్రమను ఏర్పాటు చేశారు. అందులో లే అవుట్ ప్రకారం 11వ నంబరు గల స్థలానికి ఉత్తరం.. దక్షిణం ఇరువైపుల 30 అడుగుల రోడ్లున్నట్లు మండల సర్వయర్ ద్వారా ఎండార్స్మెంట్ పొందారు . అయితే ఆ రోడ్డుకు ఆనుకొని దక్షిణం వైపు తమ్మన శ్రీనివాస రావు కు చెందిన ఆగ్రో ఇండస్ట్రీస్ ఉన్నది. ఆ ఇండస్ట్రీకి చెందిన శ్రీనివాసరావు ఉత్తరం వైపు గల రోడ్డును ఆక్రమించి అందులో బోర్లు వేయించి పందిరి కూడా వేయించడం జరిగినది. ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా అందులో వచ్చే పొగను బూడిదను ఇతర పరిశ్రమల వైపుకు పోయేలా ఏర్పాటు చేయడంతో తమఇండస్ట్రీస్ కి ఇబ్బందికరంగా మారాయని స్థానిక పరిశ్రమల ప్రతినిధులు వాపోతున్నారు. ఇదేమిటని ప్రశ్నించే చుట్టుపక్కల పరిశ్రమల వారిని మీకు చేతనైనది చేసుకోమని బెదిరిస్తున్నట్లు పరిశ్రమల యజమానులు తెలిపారు. వాస్తవాలు పరిశీలించగా 30 అడుగుల రోడ్డున రెండు బోర్లు వేయడమే కాకుండా అందులో వచ్చే డస్ట్ కూడా అక్కడే వేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పరిశ్రమల యజమానులు కోరుతున్నారు.

# మోటార్ బైక్ అదుపుతప్పి బోల్తా -వ్యక్తికి తీవ్ర గాయాలు

**కొమరోలు మండలం నల్లగుంట్ల వద్ద జరిగిన ప్రమాదం.**

**గాయపడిన వ్యక్తి వినుకొండ వాసిగా ఎన్ రమణ గాగుర్తింపు.**



కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 29

కొమరోలు మండలం నల్లగుంట్ల సమీపంలోని సాయిబాబా గుడి ఎదురుగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో వినుకొండకు చెందిన ఎం రమణ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. వినుకొండకు చెందిన ఎం రమణ తన భార్యతో కలసి ద్విచక్ర వాహనంపై అన్నమయ్య జిల్లా కొత్తపల్లిలో జరుగుతున్న తమ బంధువుల శుభకార్యానికి వెళ్లి శుక్రవారం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. కాగా కొమరోలు మండలం నల్లగుంట్ల సమీపంలోని సాయిబాబా గుడి వద్ద ఎదురుగా వస్తున్న లారీని తపించే ప్రయత్నంలో మోటార్ బైక్ అదుపుతప్పి బోల్తా పడింది .ఆ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న ఎన్ రమణకు తీవ్ర గాయాలు కాగా, ఆయన భార్య స్వల్ప గాయాలతో బయటపడింది. సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ రమణకు ప్రథమ చికిత్స చేసి గిద్దలూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ రమణ చికిత్స పొందుతున్నాడు.

# కిల్కారి సేవలపై గర్భిణీలకు అవగాహన కల్పించాలి...

## *సమీక్షా సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారి...*



**కార్పొరేషన్ ఒంగోలు పెన్ పవర్ ఆగస్టు 29**

జిల్లా స్థాయి ఆశ నోడల్ ఆఫీసర్ల మీటింగ్ నందు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై అలాగే కిల్కారి సేవలు పై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చాంబర్ నందు శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కిల్కారి కాల్ వల్ల వచ్చే ఉపయోగాలను ఆయన వివరించారు. జిల్లా లో కిల్కారి కాల్ వచ్చినపుడు కాల్ రిసీవ్ చేసుకునే గర్భిణీలు, బాలింతల సంఖ్యను పెరిగేలా చూడాలని చెప్పారు. దీని వలన జిల్లా లో కిల్కారి రిసీవర్స్ సంఖ్య పెరుగుతోంది అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కిల్కారి ప్రోగ్రాంను గర్భిణీలు, బాలింతలు కొరకు ప్రవేశం పెట్టడం జరిగిందని వివరించారు. మాత శిశు మరణాలు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం ఈ కిల్కారి కాల్ సర్వీస్ను ప్రవేశ పెట్టిందని చెప్పారు. గర్భిణీ 4 వ నెల మొదలుకొని బిడ్డ సంవత్సరం వయస్సు వచ్చే వరుకు కిల్కారి కాల్స్ వస్తాయని అన్నారు. వాయిస్ కాల్స్ వారానికి ఒక సారి వస్తాయని 2 నిమిషాలు లోపు కాల్ వ్యవధి ఉంటుందని, తల్లీ బిడ్డ ల ఆరోగ్య క్షేమ సమాచారాన్ని అందచేస్తూదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే కిల్కారి కాల్ నెంబర్ 911600103660, ఈ కాల్ నెంబర్ ని గర్భిణీ మొబైల్ లో సేవ్ చేసుకున్నట్ల అయితే కాల్ వచ్చినపుడు ఎత్తి పూర్తిగా సమాచారాన్ని వినగలుగుతారు. తిరిగి మరలా ఆ సమాచారాన్ని వినాలి అనుకునే వాళ్ళకి 14423 అనే టోల్ ఫ్రీ నెంబర్ కి చేసి వినవచ్చు అని చెప్పారు. ఆశ నోడల్ ఆఫీసర్లు మీ ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరధి లో ఉన్న గర్భిణీలు, బాలింతలు కు ఆశ/ఏ.యన్.యమ్. లు ద్వారా కిల్కారి గురించి అవగాహన కలిగించాలని, వాళ్ళ మొబైల్ లో కిల్కారి నంబర్స్ సేవ్ అయే విధంగా చూడాలని సూచించారు. ఈ కిల్కారి సేవలను గర్భిణీలు, బాలింతలు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా జులై నెల లో కిల్కారి రిసీవర్స్ లో బాగా పెర్ఫార్మన్స్ చేసిన ఆశా వర్కర్లకు బహుమతులు ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో డి.సి.యమ్. యమ్.రాజేశ్వరి, కిల్కారి రీజినల్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాజు పాల్గొన్నారు.

# నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

## - వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు



**కార్పొరేషన్ ఒంగోలు పెన్ పవర్ ఆగస్టు 29**

ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. నగరంలోని పలు ప్రవేట్ ఆసుపత్రులను స్కాన్ సెంటర్లను వైద్య ఆరోగ్యశాఖ అధికారి శుక్రవారం అకస్మిక తనిఖీ చేశారు. జిల్లాలో మొత్తం తొమిది వైద్య బృందాలతో ప్రవేట్ ఆసుపతులను తనిఖీలు నిర్వహించారు. ప్రవేటు ఆసుపత్రుల్లోని వివిధ రికార్డులను ఆయన పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలను, వాటి వివరాలను నమోదు చేస్తున్న రికార్డులను కూడా నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాధారణ తనిఖీల్లో భాగంగా జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రులు నిర్వహిస్తున్న ప్రతిఒక్కరూ ఆంధ్రప్రదేశ్ అల్లోపతి క్లినికల్ కేర్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, 2002 కింద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకోని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి ప్రైవేట్ ఆసుపత్రి తప్పనిసరిగా పొల్యూషన్, ఫైర్, బయో మెడికల్ వేస్టేజీ అనుమతి పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఆసుపత్రులు అందిస్తున్న సేవలు, వాటికి వసూలు చేసే ధరల పాట్టికలను కూడా తెలియజేసేలా ధరల బోర్డును తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. అదేవిధంగా ప్రైవేట్ ఆసుపత్రులు ఓపి రిజిస్టర్, ఐపి రిజిస్టర్ కేస్ షీట్లు, తదితర రిజిస్టర్లు కూడా తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఈ తనిఖీల్లో డాక్టర్ శ్రవణ్ కుమార్, మాస్ మీడియా అధికారి డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

# పొదిలిలో ఘనంగా కాటూరి వర్ధంతి వేడుకలు



**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 29**

దివంగత మాజీ మంత్రి, సీనియర్ తెలుగుదేశం నాయకులు, మాజీ పార్లమెంటు సభ్యులు కాటూరి నారాయణస్వామి వర్ధంతి వేడుకలు పొదిలిలో శుక్రవారం నాడు ఘనంగా జరిగాయి. కాటూరి నారాయణస్వామి 15వ వర్ధంతి సందర్భంగా స్థానిక చిన్న బస్టాండ్ సెంటర్లోని నారాయణస్వామి విగ్రహానికి తెలుగుదేశం నాయకులు పూలదండలు వేసి, తమ నివాళులు అర్పించారు. అలాగే కాటూరి నారాయణస్వామి చేసిన సేవలను ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. కాటూరి తనయుడు నారాయణ ప్రతాప్ ఆధ్వర్యంలో జరిగిన వర్ధంతి వేడుకల్లో పొదిలి మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, తెలుగుదేశం పట్టణ శాఖ అధ్యక్షులు ముల్లా కుద్దూస్, శివాలయం చైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, మాజీ చైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, దేశం నాయకులు ఎండి గౌస్, షేక్ షాహిద్, కాటూరి శ్రీను, కాటూరి వెంకటేశ్వర్లు, కాటూరి నారాయణస్వామి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు భాషాభివృద్ధికి పాటుపడాలి

## - ఒంగోలు ఉప విద్యాశాఖ అధికారి చంద్రమౌళేశ్వర రావు



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఆగస్టు 29**

రోజురోజుకు తెలుగు భాష ను ఉపయోగించటం తగ్గిపోతూ ఉందని దాన్ని పెంపొందించవలసిన అవసరం ఎంతైనా ఉందని ఒంగోలు ఉప విద్యాశాఖ అధికారి చంద్రమౌళేశ్వర రావు అన్నారు. ఒంగోలు బండ్లమిట్ట లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్ర వారం ప్రధానోపాధ్యాయురాలు జి.కృష్ణకుమారి అధ్యక్షతన జరిగిన జిల్లాస్థాయి తెలుగు భాషా దినోత్సవ వేడుకలలో ముఖ్యఅతిథిగా చంద్రమౌళేశ్వర రావు పాల్గొన్నారు. గతంలో గల గ్రాంథిక భాష యొక్క ఇబ్బందిని వ్యవహారిక భాష యొక్క అవసరాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా మార్కాపురం ఉప విద్యాశాఖ అధికారి మామిల్లపల్లి శ్రీనివాసరెడ్డి పాల్గొని తెలుగు భాష యొక్క ఔన్నత్యాన్ని, తెలుగు భాష యొక్క అవసరాన్ని నొక్కి వక్కాణించారు. ఇతర భాషలను, ఇతర శాస్త్రాలు ఎన్ని నేర్చుకున్నప్పటికీ మాతృభాష మాత్రం విడనాడ రాదని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాష పండితులు తెలుగు భాషా దినోత్సవ ప్రత్యేకతను వివరించారు. విద్యార్థులు తెలుగు భాష యొక్క ఔన్నత్యాన్ని తెలుపుతూ అనేక మంది విద్యార్థులు పాటలు, పద్యాలు, భరతనాట్యము, మరియు ఫోక్ డాన్స్, వేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ డి.చంద్రశేఖర్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# వినాయక కలశం వేలంపాటలో 19 లక్షలకు కైవసం చేసుకున్న ముత్యాల నారాయణరెడ్డి







**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 29**

మండలంలోని అయ్యలూరివారిపల్లి గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం గణపతి మండపం వద్ద వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కలశం వేలంపాట నిర్వహించారు వేలం పాటలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు వేలంలో కలశం అక్షరాలా 19 లక్షల పదివేల రూపాయలకు గ్రామానికి చెందిన ప్రకాశం జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి ముత్యాల నారాయణరెడ్డి గ్రామ సర్పంచ్ ముత్యాల భారతి దంపతులు పాట వెచ్చించి దక్కించుకున్నారు ఈ సందర్భంగా గ్రామస్తులు ఉత్సవ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు వారిని శాలువా తో సన్మానించి అభినందించారు వినాయకుని పూజ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి కలశం ను ఊరేగింపుగా మేళ తాళాలతో ఇంటి వద్దకు తీసుకొని వెళ్లారు మహిళలు సంప్రదాయబద్ధంగా హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు కుటుంబ సభ్యులు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకుని కలశం వేలంపాటలో కైవసం చేసుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ వినాయకుని ఆశీర్వాదాలతో అందరికీ సుఖసంతోషాలు కలగాలని కోరుకున్నట్లు తెలిపారు అనంతరం ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆధ్వర్యంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వినాయకునికి విశేష పూజలు నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు తదుపరి భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.

## 3వ రోజు నిమర్జనానికి తరలిన గణనాధులు

### అలరించిన హిజ్రా నృత్యాలు



**గుడ్లూరు, పెన్ పవర్, ఆగస్టు 29**

వినాయక పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలం పరిధిలో ప్రజలు గణనాధులను భారీగా ప్రతిష్టించి, విశేష పూజలు నిర్వహిస్తున్నారు. మూడవరోజు కావడంతో కొన్నిచోట్ల గణనాధులు నిమర్జనానికి తరలివెళ్లారు. ఈ యేడు చాలా తక్కువ సంఖ్యలో గణనాధులు మూడవరోజు నిమర్జనానికి తరలివెళ్లాయి. డీజే బాక్సులతో యువకుల కేరింతలకు, హిజ్రాల డాన్స్ లు తోడుకావడంతో నిమర్జనం పండుగ వాతావరణంలో కొనసాగింది. అతిగాశబ్దం వచ్చే డీజే బాక్సులు, అసభ్యకర(హిజ్రా) నృత్యాలు వంటి వాటి విషయంలో కఠిన చర్యలు ఉంటాయని పోలీసులు తెలిపినా, డీజే శబ్దాలు, హిజ్రా నృత్యాల వంటివి స్టేషన్ ముందు నుంచే వెళుతున్నా ఎందుకనో పోలీసులు చూసి, చూడనట్టు వ్యవహరించడం కొసమెరుపు.

## ఆదాని విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అందరూ వ్యతిరేకించాలి




**దొనకొండ ఆగస్ట్ 29 పెన్ పవర్**

మండలంలో సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన సభలో, 25 ఏళ్ల క్రితం బషీరాబాద్ విద్యుత్ పోరాటంలో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామిలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నేతలు ప్రభుత్వ విద్యుత్ సంస్కరణలను, పెరిగిన ఛార్జీలు, స్మార్ట్ మీటర్లను తీవ్రంగా వ్యతిరేకించారు. మోడీ-ఆదాని అనుకూల విధానాలను, అలాగే చంద్రబాబు ప్రభుత్వం కూడా అదే మార్గంలో నడుస్తుందంటూ విమర్శించారు. ప్రజలపై భారం పెడుతూ, ఎన్నికల హామీలను విస్మరించారని ఆరోపించారు. పాల్గొన్న నాయకులు విద్యుత్ ఉద్యమంలో అమరుల త్యాగాలను స్మరించి, ప్రజల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుందుర్తి చిన్న నరసింహులు ఎర్రగుంట్ల ప్రభాకర్ గుడిమెట్ల అబ్రహం రాయన చెన్నయ్య గుడిమెట్ల ఏడుకొండలు కూరవాడి రామయ్య ఎర్రగుంట్ల కోటేష్ తోక రాజా. బొజ్జ దుర్గ గుడిమెట్ల నాగేష్. వెంకటేశ్వర్లు. స్వామి తదితరులు పాల్గొన్నారు.

## కొమరోలు పోలీస్ స్టేషన్‌లో వినాయక చవితి వేడుకలు

### పోలీస్ స్టేషన్ ఆవరణలో గణనాథుని విగ్రహం ఏర్పాటు చేసి పూజలు చేసిన పోలీసులు



**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 29**

కొమరోలు పోలీస్ స్టేషన్లో ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో వినాయక చవితి పర్వదిన వేడుకలు, నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు .వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో గణనాథుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు .ఆ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛానాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. గత మూడు రోజులుగా గణనాథునికి పూజలు నిర్వహించిన పోలీసులు శుక్రవారం ఆనందోత్సవాలతో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. గణనాథుని విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై అలంకరించి మేళ తాళాలతో ఊరేగింపుగా తరలించి బాదినేనిపల్లి సమీపంలోని పులి వాగులో నిమజ్జనం చేశారు. ఆ కార్యక్రమంలో ఎస్సై నాగరాజు, ఏఎస్ఐ మునాఫ్, హెడ్ కానిస్టేబుల్ నారాయణ ,పోలీస్ కానిస్టేబుళ్లు శివరామకృష్ణ ,పీరయ్య ,వీరభద్ర, అలీ తో పాటు పలువురు కానిస్టేబుళ్లు ,మహిళా కానిస్టేబుల్స్, హోంగార్డులు, పోలీస్ జీప్ డ్రైవర్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

## వాడుకభాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు

### – ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు




**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఆగస్టు 29**

గ్రాంధికభాష పదబంధాలలో చిక్కుకున్న తెలుగు భాషను వాడుక భాషగా తీర్చిదిద్దిన వాడుకభాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు అని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు అన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషాదినోత్సవాన్ని ప్రకాశం జిల్లా రచయితల సంఘం ఆద్వర్యంలో నిర్వహించారు. రంగారాయుడు చెరువు వద్ద ఉన్న తెలుగుతల్లి, అన్నమయ్య, శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాలకు పూలమాలలు వేసి నీరాజనాలు సమర్పించారు. పండితులకు మాత్రమే పరిమితమైన భాషను పామరుల చెంత చేర్చాలనే ఉద్దేశంతో భాషోద్యమానికి శ్రీకారం చుట్టి తెలుగును వాడుక భాషగా అమలుపరిచిన ధీశాలి గిడుగు పిడుగు అని అన్నారు. ఈ సందర్భంగా మూడు విగ్రహాలు ఏర్పాటు చేసిన లలిత కళా అకాడమి అధ్యక్షులు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి, సభ్యులు కె.ఎస్.విప్రసాద్, సయ్యద్ ఇస్మాయిల్, ఆంధ్రపద్య సారస్వత పరిషత్ అధ్యక్షులు పింగళి పూర్ణచంద్రరావు, వినియోగదారుల సంఘం జిల్లా సభ్యులు ఏనుగుల సురేష్, సంస్కార భారతి జిల్లా కన్వీనర్ కత్తి రంగమన్నార్, నేచర్ సేవా ఫౌండేషన్ అధ్యక్షులు రాజశేఖర్, కవులు, రచయితలు, భాషాభిమానులు, బుచ్చేశ్వరరావు, కరవది సుబ్బారావు, ఓరుగంటి ప్రసాద్, బి.ఎస్.ఎన్.ఎల్. శ్రీనివాసరావు, మువ్వా నాగేశ్వరరావు, యోబు, ఆళ్ళ భాస్కరరెడ్డి, ఆర్.టి.ఒ. ఆఫీసు శ్రీను, గుర్రం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై ఐక్రిసాట్, టెరి నిపుణుల పర్యటన



**కార్పొరేషన్ ఒంగోలు పెన్ పవర్ ఆగస్టు 29**

రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయం లోని పీఎండీఎస్, కాంపాక్ట్ బ్లాక్స్, ఏ-గ్రేడ్, ఏటీఎం మోడల్స్ వంటి ఉత్తమ నమూనాలను పరిశీలించేందుకు ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది సెమీ-అరిడ్ ట్రాపిక్స్ ( ఐ సి ఆర్ ఐ ఎస్ ఏ టి), ది ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్ (టీ ఈ ఆర్ ఐ) నిపుణులు శుక్రవారం జిల్లాలో పర్యటించారు. ఈ పర్యటన జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిని ఆధ్వర్యంలో జరిగినది. ఐ.సి.ఆర్.ఐ.ఎస్. ఏ.టి అనేది ఆసియా, ఆఫ్రికాలోని సెమీ-ఎరిడ్ ప్రాంతాల్లో ఆకలి, పేదరికం, పర్యావరణ క్షీణతను తగ్గించేందుకు డ్రైల్యాండ్ వ్యవసాయం, ఆహార వ్యవస్థలను మెరుగుపరచడం పై దృష్టి సారించే అంతర్జాతీయ సంస్థ. టి.ఇ.ఆర్.ఐ అనేది స్వతంత్ర, లాభాపేక్షలేని పరిశోధనా సంస్థ. ఇది ఎనర్జీ, పర్యావరణం, వాతావరణ మార్పు, సుస్థిర అభివృద్ధి రంగాల్లో వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేస్తుంది. ఈ పర్యటనలో భాగంగా నిపుణులు మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామానికి చెందిన రైతు సిహెచ్. రామాంజనేయులు సాగుచేస్తున్న రెండున్నర ఎకరాల్లోని 20 రకాల పంటల వైవిధ్యతను పరిశీలించారు. అనంతరం చీమకుర్తి, సంతనూతలపాడు, కొత్తపట్నం మండలాల్లోని ఏ-గ్రేడ్ మోడల్ పొలాలను పరిశీలించారు. కొత్తపట్నం గ్రామంలో మల్లేశ్వరి నడుపుతున్న ప్రకృతి వనరుల కేంద్రం (బయో రిసోర్స్ సెంటర్) ను కూడా నిపుణులు సందర్శించారు. అలాగే హెల్త్ అండ్ న్యూట్రిషన్ విభాగం గర్భిణీ స్త్రీలు, బాలింతల కోసం చూపుతున్న శ్రద్ధ, సేవలను వారు అభినందించారు. ఈ పర్యటనలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిని, ఐ.సి.ఆర్.ఐ.ఎస్.ఏ.టి బృందం లీడ్ డాక్టర్ హరి, కే. సుధీని, టి.ఈ.ఆర్.ఐ బృందం లీడ్ డాక్టర్ హరిందు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## అన్నయ్య అక్క ఉత్సవాలలో పూర్తి బాధ్యత కమిటీ వారిదే త్రిపురాంతపురం సిఐ జి అస్సాన్ వెల్లడి




**దొనకొండ ఆగస్టు 29 పెన్ పవర్**

మండలంలో వినాయక చవితి సందర్భంగా గ్రామ గ్రామాలలో పర్మిషన్స్ తెచ్చుకొన వినాయకుని పూజ కార్యక్రమాలు నిర్వహించే వారని తిప్పునంతపురం సిఐ జి హసన్ సందర్శించి వినాయక నిమర్ జ్జనం కార్యక్రమాలలో ఆయా కమిటీ సభ్యులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు బిగించాలని డిజె సౌండ్ సిస్టం ప్రజలకు ఇబ్బంది లేకుండా అసలీలమైన అసభ్యకరమైన పాటలు డాన్సులు లేకుండా ఆయా కమిటీ సభ్యులచే భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేయాలని ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో త్రిపురాంతకం సీఐ జి హసన్ మరియు దొనకొండ ఎస్సై టీ త్యాగరాజు, పోలీస్ శాఖ సిబ్బంది వినాయక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు 11వ ప్రకాశం జిల్లా మహాసభ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగినది.శుక్రవారం జరిగిన కార్యక్రమంలో 23 మందిని జిల్లా కమిటీ ఎన్నుకోవడం జరిగినది. జిల్లా గౌరవ అధ్యక్షులుగా చీకటి శ్రీనివాసరావు, నూతన అధ్యక్ష కార్యదర్శులుగా కే సుబ్బరాయుడు, ( మార్కాపురం) కొర్నేపాటి శ్రీనివాసరావు, కే సామ్రాజ్యం, ఇట్టా నాగయ్య, చీమకుర్తి. ఏడుకొండలు, కార్యదర్శులు టీ విజయమ్మ, బి. కోటేశ్వరరావు, సిహెచ్ ప్రసాద్, పి పద్మ, బి భారతి లను ఎన్నుకోవడం జరిగినది. మహాసభలో మునిసిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, గత సమ్మె కాల ఒప్పందాలను జీవోలు ఇవ్వాలని, జూలై 12 నుండి 21 వరకు సమ్మె కాలపు వేతన జీవోను ఇవ్వాలని, కోవిడ్ కార్మికులందరికీ ఆప్కాస్ లోకి తీసుకోవాలని, కలెక్టర్ ఇచ్చిన జీవో ప్రకారం 18 వేల వేతనం ఇవ్వాలని,పిఎఫ్ సమస్యలు పరిష్కరించాలని, ఈఎస్ఐ గుర్తింపు కార్డు ఇవ్వాలని, కార్మికులందరికీ సేఫ్టీ మీటర్లు ఇవ్వాలని, పనిముట్లు ఇవ్వాలని, మస్టర్ పాయింట్లో మంచినీళ్లు టాయిలెట్స్ సౌకర్యాలు కల్పించాలని, మునిసిపల్ కార్మికులపై రాజకీయ వేధింపులు.. తొలగింపులు ఆపాలని, ఒంగోలు నగరంలో.. పనిలో నిలుపుదల చేసిన మేస్త్రీలను పనిలోకి తీసుకోవాలని,

మునిసిపల్ కార్మికులందరికీ సంక్షేమ పథకాల అమలు చేయాలని, కార్మికుల సంఖ్యను పెంచాలని తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు.

## మాతృభాష అభివృద్ధికి కృషి చేయాలి

### – జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఆగస్టు 29**

మాతృభాష అయిన తెలుగు అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్లో ఆయన చిత్రపటానికి జాయింట్ కలెక్టరుతో పాటు డిఆర్ఓ బి.చిన ఓబులేసు, ఇతర అధికారులు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చి, నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియచెప్పిన మహనీయుడు గిడుగు వెంకట రామమూర్తి అని కొనియాడారు. ఆయన జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. అధికారిక కార్యక్రమాలలోనూ, ఉత్తర ప్రత్యుత్తరాలలోనూ తెలుగు భాషకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన చెప్పారు. తెలుగు భాషలోని మాధుర్యాన్ని ప్రతి ఒక్కరూ ఆస్వాదించాలని ఆయన పిలుపునిచ్చారు. తాను సివిల్స్ పరీక్షలు సైతం తెలుగులోనే రాసిన విషయాన్ని ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి రవి, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రొ కబడ్డీ.. కబడ్డీ.. కొత్త కూత...

**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)... బ్యాడ్మింటన్ లో బ్యాడ్మింటన్ ప్రీమియర్ లీగ్ (బీపీఎల్)... ఇలా ఫేమస్ గేమ్స్ కు ఇండియాలో ప్రత్యేకించి లీగ్ లు ఉన్నాయి...వీటికి ఆదరణ కూడా అంతే స్థాయిలో ఉంది..! ఇలాంటి నేపథ్యంలోనే పుట్టుకొచ్చింది ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్). భారత గ్రామీణ క్రీడ అయిన కబడ్డీకి దేశంలో ఇంత ఆదరణ ఉందా? అన్నట్లుగా... అప్పటిదాక ఎవరూ ఊహించని కూడా ఊహించని విధంగా క్లిక్ అయింది ప్రొ కబడ్డీ లీగ్. 2014లో ప్రారంభమైన ఈ లీగ్ తొలి నాళ్లలో విపరీతమైన ఆదరణ చూరగొంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, ప్రజలు కబడ్డీ మ్యాచ్ లకు ఆకర్షితులయ్యారు. ఈ క్రమంలో వరుసగా సీజన్లు ముగిశాయి. పదేళ్ల తర్వాత చూస్తే..ఆదరణ తగ్గుతోందని తేలింది.

**తెలుగు వారు లేకనా?**
ప్రొ కబడ్డీ లీగ్ సక్సెస్ స్థాయి ఏమిటో చెప్పాలంటే.. ఐపీఎల్ తో పోల్చి చూడాలి. ఐపీఎల్ మ్యాచ్ లను చూసినట్లే ఈ లీగ్ నూ ఆదరించారు. సహజంగానే ఇందులో తెలుగువారి పాత్ర అధికం అని చెబుతుంటారు. అయితే, మనదగ్గర క్రమంగా వ్యూయర్ షిప్ పడిపోసాగింది. ఉత్తర భారత దేశంలో మాత్రం నిలకడగా ఉంది. ఎక్కువ శాతం తెలుగు ఆటగాళ్లు లేకపోవడం తెలుగు వారి ఆదరణ తగ్గడానికి కారణం ఏమో?

**కొత్త కూతతో.. పోటీకి తొడగొడుతూ...**
ఎప్పుడైనా కాలానికి తగ్గట్లు మారాల్సిందే. అందులోభాగంగానే ప్రొ కబడ్డీ లీగ్ నిర్వాహకులు మళ్లీ వ్యూయర్ షిప్ పెంచే చర్యలు చేపడుతున్నారు. ఇదివరకటి సాధారణ పాయింట్ల పద్ధతి కాకుండా టై మ్యాచ్ లకు షూటౌట్ రైడ్స్, గోల్డెన్ రైడ్ వంటివి అమల్లోకి తేనున్నారు. ఫలితం డ్రాగా మిగలకుండా ఫలితం తేల్చేందుకు ఈ విధానాన్ని ఎంచుకున్నారు. దీంతో ఆట రసవత్తరంగా సాగుతుందని భావిస్తున్నారు.



**తొలి మ్యాచ్ లో తెలుగు వీరులు..**
12వ సీజన్ లో 12 జట్లు బరిలో ఉన్నాయి. తొలి మ్యాచ్ లో తెలుగు టైటాన్స్ –తమిళ్ తలైవాస్ తలపడనున్నాయి. శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆటగాళ్లను ప్రత్యేకంగా సన్మానించి.. ట్రోఫీని ఆవిష్కరించనున్నారు. విశాఖ నుంచి జైపూర్, చెన్నై, ఢిల్లీలలో మ్యాచ్ లు జరగనున్నాయి. మొత్తం 108 మ్యాచ్ లు నిర్వహించనున్నారు.

**గెలిస్తే 2.. ఓడితే 0.. ప్లే ఇన్ మ్యాచ్ లు**
–కొత్త పాయింట్ల విధానం ప్రకారం విజేత జట్టుకు 2, ఓడిపోయిన జట్టుకు సున్నా పాయింట్లు లభిస్తాయి. ఇది ప్రేక్షకులు స్టాండింగ్స్ ను సులభంగా ఫాలో అయ్యేందుకు తోడ్పడుతుందని లీగ్ నిర్వాహకులు చెబుతున్నారు.
ప్రస్తుత సీజన్ లో తొలిసారి ప్లే ఇన్ మ్యాచ్ లు నిర్వహిస్తారు. లీగ్ దశలో టాప్ –8 జట్లు ప్లే ఆఫ్స్ చేరతాయి.
5 నుంచి 8వ స్థానాల్లో ఉన్న జట్లు ప్లే ఇన్ మ్యాచ్ లు ఆడతాయి. విజేతలు ఎలిమినేటర్లకు వెళ్తారు.
3,4 స్థానాల్లో ఉన్న జట్లు మినీ క్వాలిఫయర్స్ ఆడతాయి. ఓడిన జట్టుకు ఎలిమినేటర్ లో తలపడుతుంది.
టాప్ 2 జట్లు క్వాలిఫయర్ 1లో తలపడతాయి. విజేత ఫైనల్ కు చేరుతుంది. ఓడిన జట్టు క్వాలిఫయర్ 2లో ఆడుతుంది.

–కొత్త విధానంలో మూడు ఎలిమినేటర్లు, రెండు క్వాలిఫయర్లు జరుగుతాయి. ఈ పద్ధతితో సీజన్ ను ఆసాంతం జన రంజకంగా నిర్వహించవచ్చని ఆర్గనైజర్లు భావిస్తున్నారు.

# ప్రీతి కేసు బయటకు తెచ్చింది ఎవరు? నా చిత్తశుద్ధిని ప్రశ్నించొద్దు



**హైదరాబాద్ పెన్ పవర్:** కర్నూలుకు చెందిన బాలిక సుగాలి ప్రీతి కేసుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. తన కుమార్తెను చంపిన కేసులో తమకు న్యాయం చేయలేదని, ప్రతిపక్షంలో ఉండగా, జనసేనాని పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రీతి తల్లి పార్వతి ఇటీవల ప్రశ్నించారు. పవన్ డిప్యూటీ సీఎం అయ్యాక తమ కేసును పట్టించుకోవడం లేదని పార్వతి విమర్శలు చేయడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. పార్వతి మాట్లాడిన వీడియోను ప్రతిపక్ష వైసీపీ వైరల్ చేసింది. దీనిపై జనసేన స్పందిస్తూ పార్వతి ఆరోపణలను ఖండించింది. సాయం చేసిన వారు కృతజ్ఞత కోరుకోవడం ఎంత తప్పో.. సాయం పొందిన వారు కృతజ్ఞత చూపకపోవడం అంతే తప్పని జనసేన పార్టీ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ నేపథ్యంలో విశాఖలో పార్టీ సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్ సుగాలి ప్రీతి కేసుపై తన చిత్తశుద్ధిని ప్రశ్నించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. కాసిన చెట్లకే రాళ్ల దెబ్బ అన్నట్లు తన వల్లే కేసు బయటకు వచ్చిందని, సీబీఐ దర్యాప్తు వరకు వెళ్లిందని వెల్లడించారు. సుగాలి ప్రీతి తల్లి ఆరోపణలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేరుగానే తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టారు. తనపై ఒత్తిడి తీసుకురావడం వల్ల ప్రయోజనం లేదని, జనసేన పోరాటం వల్లే సుగాలి ప్రీతి కేసులో తల్లిదండ్రులకు అప్పటి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కింద ఇవ్వాల్సిన పరిహారాలను చెల్లించిందన్న విషయాన్ని గుర్తించాలని కోరారు. నాటి ప్రభుత్వాన్ని తాను మాత్రమే ధైర్యంగా ఎదిరించానని సుగాలి ప్రీతికి న్యాయం చేయాలని రెండు లక్షల మందితో వెళ్లి పోరాడానని డిప్యూటీ సీఎం తెలిపారు. సుగాలి ప్రీతి కేసులో తాను అన్నివిధాలుగా సహకరిస్తే ఇప్పుడు తనపైనే విమర్శలు చేయడం ఎంతవరకు సబబు అని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. 'ఎవరైతే చేయూతనిస్తారో, ఎవరైతే అండగా నిలుస్తారో వారిని తిడితే ఎలా?'అంటూ ప్రశ్నించారు. గత ప్రభుత్వం మీద, అప్పటి ముఖ్యమంత్రి మీద మాట్లాడటానికి ఎవరికైనా ధైర్యం ఉందా? అంటూ పవన్ వ్యాఖ్యానించారు. మాజీ ముఖ్యమంత్రిని అరెస్టుచేస్తే ఎవరూ రోడ్డుపైకి రాలేకపోయారు. అలాంటి ప్రభుత్వంలో సుగాలి ప్రీతి కేసులో నేను ధైర్యంతో వెళ్లి ఓ తల్లి వేదనను బయట ప్రపంచానికి తెలియజేశానని పవన్ తెలిపారు. తన పోరాటం వల్లే అప్పటి ప్రభుత్వం కేసును సీబీఐకి రిఫర్ చేసిందన్నారు.

అంతేకాకుండా తన వల్ల బాధితురాలి తల్లిదండ్రులకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద అన్నిరకాలుగా మేలు జరిగిందని వివరించారు. కర్నూలు రూరల్ మండలంలో బాధితులకు ఐదు ఎకరాల భూమిని కేటాయించారని చెప్పారు. దీని మార్కెట్ విలువ ప్రస్తుతం ఎకరా రూ.2 కోట్లు ఉంటుందని అంటున్నారని తెలిపారు. అదేవిధంగా కర్నూలు కార్పొరేషన్ కల్లూరు వద్ద 5 సెంట్ల ఇండ్ల స్థలం ఇచ్చారని, అక్కడ సెంటు భూమి పది నుంచి పదిహేను లక్షలు పలుకుతుందని చెప్పారు. ఇక బాధితురాలి తల్లిదండ్రులకు రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం కూడా ఇచ్చారని, ఇదంతా తన పోరాటం వల్లే జరిగిన విషయాన్ని మరచిపోయి తనపైనే తిరిగి విమర్శలు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు.
తాను మెత్తని మనిషినని, తనపై రాళ్లు వేయడం తేలికన్న ఆలోచనతోనే ఇలాంటి విమర్శలు చేస్తున్నారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను శిక్షించాలనే సంకల్పంతోనే తాను పనిచేస్తున్నట్లు పునరుద్ఘాటించారు. డిప్యూటీ సీఎంగా చార్జి తీసుకున్న వెంటనే సుగాలి ప్రీతి కేసు విషయమై తాను ఆరా తీశానని, ఈ విషయాలను తాను చెప్పాలా? అంటూ ప్రశ్నించారు. గత ప్రభుత్వం సీబీఐ దర్యాప్తు జరపాలని లేఖ రాసి వదిలేసిందని, దీనిపై ఎలా ముందుకు వెళ్లాలో ఆలోచిస్తాన్నామని చెప్పారు. ఇప్పటికే సీఐడీ చీఫ్ తోనూ డీజీపీతోనూ ఈ కేసుపై చర్చించినట్లు పవన్ వివరించారు. బాధితులు ఎవరిపై ఆరోపణలు చేస్తున్నారో వారి డీఎన్ఏ మ్యాచ్ అవడం లేదని పోలీసు దర్యాప్తులో తేలిందని, ఈ కేసును మ్యానేజ్ చేయడానికి గత ప్రభుత్వంలో ప్రయత్నాలు జరిగాయని, అందుకే అసలు దోషులు తప్పించుకున్నారని పవన్ వెల్లడించారు. ప్రీతి హత్యను ఒక కేసుగా భావించడం లేదని, ఇది ఒక సామాజిక సమస్యగా పరిగణించి పాప మరణానికి కారణమైన వారిని తప్పకుండా శిక్షిస్తామని తెలిపారు.

# ఒకే రోజు.. ఒకే జిల్లాలో బాబు-పవన్-లోకేష్.. తేడా ఏంటంటే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు ఒకే రోజు ఒకే జిల్లాలో పర్యటిస్తున్నారు. అయితే... వారు పాల్గొన్న కార్యక్రమాలు మాత్రం భిన్నంగా ఉన్నాయి. అయితే.. ఒకే రోజు ఇలా ముగ్గురు కీలక నాయకులు.. ఒకే జిల్లాలో పర్యటించడం మాత్రం అరుదైన ఘటనగా ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. కాగా.. వీరు ముగ్గురు విశాఖపట్నం జిల్లాలో పర్యటిస్తుండడం గమనార్హం.

**సీఎం చంద్రబాబు టూర్ ఇదీ..**
సీఎం చంద్రబాబు శుక్రవారం ఉదయం విశాఖకు చేరుకున్నారు. నోవోటెల్‌లో జరిగే 'ఫుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ సమ్మిట్'లో పాల్గొన్నారు. సందర్భంగా ఆహార ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులపై ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మత్స్య సంపదతో పాటు టమాటా, మిర్చికి మంచి సాగు ఉందని.. దీనిని సద్వినియోగం చేసుకుని.. ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలకు ఆయన సూచించారు. తద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి, రైతులకు కూడా మేలు జరుగుతుందని చెప్పారు.

**డిప్యూటీ సీఎం పవన్.. పనులు ఇవీ..**
ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా.. గురువారం నుంచి విశాఖపట్నంలోనే ఉన్నారు. సేనానితో సేన కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం పార్టీ జిల్లాలు, నియోజకవర్గాల ఇంచార్జ్‌లతో భేటీ అయ్యారు. దీనికి ముందు ఉదయాన్నే ఆయన విశాఖలోని రుషికొండపై వైసీపీ హయాంలో నిర్మించిన ప్యాలెస్‌ను సందర్శించారు. దీనికి సంబంధించి ఏం చేయాలో ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం.. పార్టీ కార్యక్రమాలకు హాజరయ్యారు.

**మంత్రి నారా లోకేష్ షెడ్యూల్ ఇదీ..**
మంత్రి నారా లోకేష్ కూడా విశాఖపట్నంలోనే పర్యటిస్తున్నారు. వైజాగ్ కన్వెన్షన్ లో జరిగిన %–%అర్థ సమృద్ధి 2025– ఐసీఏఐ నేషనల్ కాన్ఫరెన్ %–%లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ఆయన మాట్లాడుతూ.. రా ష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని, కూటమి ప్రభుత్వం బలంగా ఉందని, వచ్చే 25 ఏళ్ల పాటు ఒకే ప్రభు త్వం కొనసాగుతుందని చెప్పారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పెట్టుబడులు పెట్టేవారు తరలి రావాలని ఆయన సూచించారు. అనంతరం విశాఖలోని చంద్రంపాలెం జడ్పీ హైస్కూల్ లో ఏఐ ల్యాబ్స్ ను ప్రారంభించారు.

## ట్రంప్ దెబ్బకు రష్యా చమురు లాభాలు కరిగిపాయే!



**హైదరాబాద్ పెన్ పవర్:** రష్యా నుంచి రాయితీ తక్కువ ధరలకు చమురు కొనుగోలు చేయడం ద్వారా భారతదేశం పొందిన సుమారు $17 బిలియన్ల లాభాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన కొత్త టారిఫ్‌లు ముప్పుగా పరిణమించాయి. ఈ టారిఫ్‌లు 50% వరకు ఉండగా.. వీటి ప్రభావం వల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో భారతదేశ ఎగుమతులు $37 బిలియన్ల మేర తగ్గే అవకాశం ఉందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ అంచనా వేసింది.

**ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం**
ఈ టారిఫ్‌ల వల్ల అత్యధికంగా ప్రభావితమయ్యేవి వస్త్రాలు, రత్నాలు, ఆభరణాలు వంటి శ్రామిక ఆధారిత రంగాలు. ఈ రంగాలలో వేలాది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి రాజకీయంగా కూడా ఒక పెద్ద సవాలుగా మారింది.

**భారత్ దౌత్య సమతుల్యత**
రష్యా రక్షణ సామాగ్రి, చమురు, భౌగోళిక రాజకీయ మద్దతు వంటి అనేక విషయాల్లో భారతదేశానికి ముఖ్యమైన భాగస్వామి అని వ్యూహాత్మక నిపుణుడు హ్యాపీమన్ జేకబ్ తెలిపారు. అదే సమయంలో అమెరికా కూడా భారతదేశానికి కీలకమైన వ్యూహాత్మక భాగస్వామి. ఈ నేపథ్యంలో భారత్ ఈ రెండు దేశాల మధ్య సమతుల్యతను కొనసాగించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు.

**అమెరికాతో కొనసాగుతున్న చర్చలు**
భారత విదేశాంగ కార్యదర్శి ప్రకారం.. అమెరికాతో ఇంధనం, అణుశక్తి సహకారం, ముఖ్యమైన ఖనిజాల అన్వేషణ వంటి అంశాలపై వర్చువల్ చర్చలు జరుగుతున్నాయి. రష్యా చమురు దిగుమతులు పూర్తిగా ఆపడం ఆర్థికంగా అసాధ్యం అని భారత అధికారులు స్పష్టం చేశారు, అయినప్పటికీ అమెరికా నుంచి చమురు కొనుగోళ్లను పెంచడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

**చమురు ధరల పెరుగుదల**
ప్రస్తుతం భారతదేశం రోజుకు 2 మిలియన్ బ్యారెల్స్ రష్యా చమురును దిగుమతి చేసుకుంటోంది. ఈ సరఫరాను ఆపేస్తే ప్రపంచ చమురు ధరలు బ్యారెల్‌కు $200 దాటవచ్చని భారత ప్రభుత్వం అంచనా వేసింది. అదనంగా రష్యా అందిస్తున్న 7% రాయితీని కూడా భారత్ కోల్పోనుంది.

**అమెరికా వైఖరిపై విమర్శలు**
రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారతదేశాన్ని విమర్శిస్తున్న అమెరికా, తాము మాత్రం అదే రష్యా నుంచి యురేనియం, పల్లాడియం, ఎరువులు కొనుగోలు చేస్తోందని న్యూఢిల్లీ ఆరోపించింది. ఇది అమెరికా యొక్క ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం అని భారత్ పేర్కొంది.

**రాజకీయ – అంతర్జాతీయ ప్రభావం**
ఈ పరిణామాలు భారత్–అమెరికా సంబంధాలను 1998లో అణు పరీక్షల తరువాత విధించిన ఆంక్షల కాలం తరహాలోనే ప్రతికూల దశకు నెట్టే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఇది వీసాలు, ఐటీ సర్వీసుల అవుట్‌సోర్సింగ్ వంటి రంగాలపైనా ప్రతికూల ప్రభావం చూపవచ్చు. ఈ ఏడాది చివర్లో బీహార్ ఎన్నికలు ఉన్నందున, మోదీ ప్రభుత్వం పన్నుల తగ్గింపులు, ప్రజలకు ఊరటనిచ్చే పథకాలను ప్రకటించే అవకాశం ఉంది. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో భారతదేశం తీసుకునే నిర్ణయాలు ప్రపంచ వాణిజ్య సమీకరణాలను కూడా ప్రభావితం చేయనున్నాయి.

# హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ప్లాన్ ను అమలు చేసిన బెంగళూరు

**హైదరాబాద్ పెన్ పవర్:** కొన్నేళ్ల క్రితం తెలంగాణ పోలీసులు చేపట్టిన ట్రాఫిక్ చలానాల డ్రైవ్ ఎంతలా సక్సెస్ అయ్యిందో తెలిసిందే. 50 శాతం.. అంతకంటే ఎక్కువ మొత్తంలో ఫైన్ల మీద రాయితీ ఇవ్వటం ద్వారా వాహనదారులు పెద్ద ఎత్తున పెండింగ్ చలానాల్ని కట్టేయటం తెలిసిందే. ఈ మోడల్ తెలంగాణలో సక్సెస్ కావటమే కాదు.. ఇప్పటికే రెండుసార్లు ఈ డ్రైవ్ నిర్వహించటం ద్వారా భారీ ఎత్తున ఆదాయం రాష్ట్ర ఖజానాకు చేరింది. తెలంగాణ పోలీసులు చేపట్టిన ఈ ట్రాఫిక్ చలానా డ్రైవ్ ను.. కొన్ని మార్పులు చేసిన బెంగళూరులోనూ అమలు చేస్తున్నారు.తెలంగాణలో మాదిరి కాకుండా.. మొత్తం చలానాలో 50 శాతం రాయితీ ఇవ్వటం ద్వారా.. పెండింగ్ చలానాల్ని క్లియర్ చేసుకునే అవకాశాన్ని వాహనదారులకు కల్పించారు. ఈ నెల 21 నుంచి వచ్చే నెల 19 వరకు ఈ ఆఫర్ ను అమలు చేస్తున్నారు. దీంతో..పెద్ద ఎత్తున వాహనదారులు తమ పెండింగ్ చలానాల్ని క్లియర్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఒక ద్విచక్ర వాహనదారుడు తనకు పడిన ఫైన్లు చెల్లించాడు.ఇతగాడి బైక్ కు ఏకంగా 100 చలానాలు పడ్డాయి. మొత్తం ఫైన్ రూ.46,500. ఇందులో 50 శాతాన్ని కట్టేసిన ఇతను.. తన చలానాల భారాన్ని సగానికి తగ్గించుకున్నాడు. ఈ రాయితీ సౌకర్యం కర్ణాటక రాష్ట్ర ఖజానకు ఆదాయాన్ని తెచ్చి పెడుతోంది. ఇప్పటివరకు దాదాపు రూ.19 కోట్ల మేర నిధులు ట్రాఫిక్ విభాగానికి చేరినట్లుగా తెలుస్తోంది. ఏమైనా.. తెలంగాణలో షురూ చేసిన ఈ ఆఫర్ చలానాలు ఉన్న వాహనదారులకు పెద్ద ఎత్తున రిలీఫ్ ను ఇస్తుందని చెప్పక తప్పదు.

# ట్రంప్ కొత్త మ్యాథమేటిక్స్ కనిపెట్టాడు.. అందరూ నేర్చుకుంటే అంతే సంగతులు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచంలోని ప్రత్యర్థి దేశాలపై ఏ ప్రాతిపదికన మీరు టారిఫ్ లు విధిస్తారు? అని ఓ మహిళా విలేకరి సంధించిన ప్రశ్నకు ట్రంప్ చెప్పిన 'లెక్కలు' అందరినీ మూర్ఛపోయేలా చేశాయి. బ్రెజిల్ పై 50 శాతం టారిఫ్ లు ఎందుకు విధించాను అనే దానిపై వివరణ ఇచ్చిన ట్రంప్ లెక్కలు దిమ్మదిరిగిపోతున్నాయి. అసలు సంబంధం లేకుండా? దేశం నచ్చకపోతే ఆయన వేసేస్తుంటాడు. దీనికి ఆయన అమెరికాతో ఆ దేశం వ్యవహరించిన తీరును.. వాళ్ల వ్యవహారశైలి ఆధారంగా ట్రంప్ చెప్పిన లెక్క అందరినీ షాక్ కు గురిచేసింది. ట్రంప్ చెప్పిన లెక్కలు చూసి.. 'ట్రంప్ కొత్త మ్యాథమేటిక్స్ కనిపెట్టాడు.. అందరూ నేర్చుకుంటే అంతే సంగతులు' అంటూ సోషల్ మీడియాలో సెటైర్లు వేస్తున్నారు.
ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నిరంతరం గందరగోళానికి గురిచేస్తున్న ఒక పేరు డొనాల్డ్ ట్రంప్. అమెరికా అధ్యక్షుడిగా ఆయన ఆర్థిక విధానాలు.. ముఖ్యంగా టారిఫ్‌లపై ఆయనకున్న ప్రత్యేకమైన విధానం ఎప్పుడూ చర్చనీయాంశమే. టారిఫ్ రేట్లను నిర్ణయించడానికి ఆయన అనుసరిస్తున్న "మ్యాథ్స్" గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక నిపుణులను ఆశ్చర్యపరిచాయి.

**ట్రంప్ విధానం: ఒక విశ్లేషణ**
ట్రంప్ తాను టారిఫ్‌లను నిర్ణయించే విధానాన్ని "నా వెరీ స్టేబుల్ బ్రెయిన్" నుండి వచ్చే "అందమైన, పర్ఫెక్ట్ నంబర్లు"గా అభివర్ణించారు. ఆయన ప్రకారం ఒక దేశంతో ఉన్న వ్యాపార లోటు, ఆ దేశం అమెరికాను "ఎంత దారుణంగా ట్రీట్ చేస్తుంది" అనే అంశం, అమెరికా "నంబర్ వన్" కాబట్టి అదనంగా కలిపే ఒక నంబర్ ఆధారంగా ఈ టారిఫ్ రేట్లు నిర్ణయించబడతాయి. ఈ వివరణ చాలామందికి అయోమయంగా అనిపించవచ్చు. అయితే, దీని వెనుక ఉన్న ఆర్థిక ఆలోచనలను మనం పరిశీలించాలి.

**సాంప్రదాయిక ఆర్థిక సిద్ధాంతాలకు భిన్నంగా:**
సాధారణంగా, టారిఫ్‌లను నిర్ణయించడానికి ఆర్థిక నిపుణులు అనేక అంశాలను పరిగణలోకి తీసుకుంటారు. ఇందులో దేశీయ పరిశ్రమలపై ప్రభావం, వినియోగదారులపై పడే భారం, అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు, ద్రవ్యోల్బణం వంటివి ఉంటాయి. ఈ విధానం చాలా సుదీర్ఘమైన పరిశోధన, సంప్రదింపులు, ప్రభావ విశ్లేషణలపై ఆధారపడి ఉంటుంది. ట్రంప్ విధానం దీనికి పూర్తిగా విరుద్ధంగా ఒక రకమైన "అనుభూతి–ఆధారిత" నిర్ణయంగా కనిపిస్తుంది. ఆయన వ్యాఖ్యలు ఈ నిర్ణయాలకు ఏ విధమైన ప్రామాణిక ఆర్థిక ఫార్ములాలు లేవని స్పష్టం చేస్తున్నాయి.

**ఒక రౌలెట్ చక్రం లాంటి పద్ధతి:**
ట్రంప్ టారిఫ్ నిర్ణయాలను విమర్శకులు ఒక రౌలెట్ చక్రంతో పోల్చారు. అంటే ఎక్కడ పడుతుందో తెలియని ఒక ఊహాజనిత నిర్ణయం ఇది. ఉదాహరణకు చైనాకు 50% టారిఫ్ ఎందుకు అనేది "ఎందుకంటే అది అద్భుతం" అని ఆయన వివరించడం, ఆర్థికపరమైన తర్కం కంటే ఒక రాజకీయ ప్రకటనగా కనిపిస్తుంది. అయితే ఈ అనిశ్చితియే ఆయన వ్యూహంలో ఒక భాగం కావచ్చు. ప్రత్యర్థి దేశాలను గందరగోళపరచి, చర్చల బల్ల మీద అమెరికాకు పైచేయి సాధించడానికి ఈ పద్ధతిని ఆయన ఉపయోగించుకోవచ్చని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు.

# 'సేవ్ టీడీపీ' ఆ నియోజకవర్గంలో మళ్లీ అగ్గి రాజుకుంది!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో అధికార కూటమిలో ప్రధాన భాగస్వామి టీడీపీ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ప్రస్తుతం పార్టీ కార్యవర్గాల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుండగా, పలు చోట్ల వివాదాలు జరుగుతున్నాయి. కార్యకర్తలు ఒకరిని కోరుకుంటే, నేతలు తమకు నచ్చిన వారిని అందలం ఎక్కించాలని చూడటమే వివాదాలకు కారణంగా తెలుస్తోంది. ఇప్పటికే పలు జిల్లాల్లో నాయకత్వాలపై పోరు జరుగుతుండగా, ఈ రోజు అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రంలో స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణికి వ్యతిరేకంగా కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. 'సేవ్ టీడీపీ' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ అగ్గి రాజేశారు.

శింగనమల నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణికి నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న టు మెన్ కమిటీకి తొలి నుంచి విభేదాలు కొనసాగుతున్నాయి. శాసనసభ ఎన్నికల్లో శ్రావణి అభ్యర్థిత్వాన్ని టు మెన్ కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. అయితే అధిష్టానం జోక్యంతో శ్రావణి గెలుపు కోసం టు మెన్ కమిటీ పనిచేసినట్లు కార్యకర్తలు చెబుతున్నారు. ఇక ఎన్నికల ఫలితాలు విడుదలైన మరుక్షణం నుంచి వీరి మధ్య విభేదాలు యథావిధిగా మొదలయ్యాయి. ఎమ్మెల్యే వర్సెస్ టు మెన్ కమిటీ అన్నట్లు పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయింది. దీంతో ఈ నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాలు అధిష్టానానికి తలనొప్పిగా మారాయని అంటున్నారు.ప్రతి చిన్న విషయాన్ని రాజకీయ కోణంలో చూడటం, ఆధిపత్యం ప్రదర్శించే అవకాశంగా వాడుకోవడంతో శింగనమల టీడీపీ రాజకీయాలు నిత్యం కాక మీద ఉంటున్నాయి. తాజాగా బుక్కరాయసముద్రం మండలంలో కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. వీరి స్థానంలో కొత్తవారిని నియమించాలని ఎమ్మెల్యే శ్రావణి ఆదేశించినట్లు చెబుతున్నారు. దీంతో శుక్రవారం వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించారు. తమ వర్గానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడంపై టు మెన్ కమిటీ మద్దతుదారులైన టీడీపీ కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అంతేకాకుండా ఎమ్మెల్యే శ్రావణి నుంచి టీడీపీని రక్షించాలని కోరుతూ 'సేవ్ టీడీపీ' నినాదాలు చేస్తూ హోరెత్తించారు.గత ఎన్నికలకు ముందు పట్టుబట్టి ఎమ్మెల్యే టికెట్ సాధించిన బండారు శ్రావణి ప్రతిభావంతురాలిగా అధిష్టానం వద్ద గుర్తింపు తెచ్చుకున్నారు. జిల్లాలో రెండు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలు ఉండగా, ఈ రెండు చోట్ల యువకులైన నేతలే ఎమ్మెల్యేలుగా ఉన్నారు. అయితే శ్రావణితోపాటే ఎమ్మెల్యేగా ఎన్నికైన మడకశిర శాసనసభ్యుడు ఎంఎస్ రాజు తన నియోజకవర్గంలో అందరినీ కలుపుకుని పోతుండగా, శ్రావణి విషయంలో మాత్రం అలా జరగడం లేదు. తొలి నుంచి ఆమె నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్న వారు.. ఇప్పుడు ఆమె అధికారం చెలాయించడాన్ని సహించలేకపోతున్నట్లు చెబుతున్నారు. దీంతోనే తరచూ విభేదాలు వస్తున్నాయని శ్రావణి వర్గీయులు ఆరోపిస్తున్నారు.అయితే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక ఆమె తమను కలుపుకుని వెళ్లడం లేదని టు కమిటీకి చెందిన నేతలు, కార్యకర్తలు వాపోతున్నారు. నెల్లూరు పెద్దారెడ్డి వంటి నాయకుడు సలహాలపై అధారపడుతున్న ఎమ్మెల్యే శ్రావణి తమను నిర్లక్ష్యం చేస్తున్నారని, అసలు పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. దీంతో శింగనమల రాజకీయం నిత్యం వాడివేడిగా సాగుతోంది. మరోవైపు పరిస్థితులు ఇలానే కొనసాగితే పార్టీ మూల్యం చెల్లించుకోక తప్పదని టీడీపీ అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధిష్టానం జోక్యం చేసుకుని ఎక్కడో ఒక చోట ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టాలని కోరుతున్నారు.

# పవన్ లెక్క పక్కా... వైసీపీకి అధికారం కల ?



**హైదరాబాద్ పెన్ పవర్:** జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాజకీయ మేథమెటిక్స్ ని బాగా ఔపాసన పట్టారు. ఆయన రాజకీయ వ్యూహాలను కూడా బాగానే ఒడిసిపట్టారు. దాంతోనే వైసీపీకి ఉక్కిరి బిక్కిరి తప్పడం లేదు. 2019లో జరిగిన పొరపాట్లు 2024 నాటికి రిపీట్ కాకుండా పవన్ చూసుకున్నారు ఫలితంగా ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. అదే సమయలో వైసీపీ ఏకంగా 11 సీట్లకు పడిపోయి పాతాళం అంచులను చూసింది. కట్ చేస్తే పవన్ మరింతగా తన వ్యూహాలను పదును పెడుతున్నారు. అది టీడీపీ అధికార ఆశలను కలగా మార్చేసే పరిస్థితి ఉందా అన్నదే ఇపుడు చర్చగా కనిపిస్తోంది.

**టీడీపీతోనే బలమైన బంధం :**

పవన్ 2014లో పార్టీ పెట్టారు అంతకు ముందు ప్రజారాజ్యంలో కొంతకాలం పనిచేశారు. మొత్తంగా చూస్తే కనుక ఆయనకు 15 ఏళ్ళకు మించి రాజకీయ అనుభవం ఉంది. అదే ఇపుడు ఆయన నిర్ణయాలలో కనిపిస్తోంది అని అంటున్నారు. ఏపీలో అధికారం 2014లో టీడీపీ వస్తే 2019లో వైసీపీకి వచ్చింది. 2024లో తిరిగి టీడీపీ కూటమికి వచ్చింది ఈ లెక్కన 2029లో వైసీపీకే అధికారం అని ఆ పార్టీ భావిస్తోంది. కానీ అలా కాదు అని పవన్ పక్కా లెక్కలతో నిరూపించబోతున్నారు. ఆయన టీడీపీతో బలమైన బంధాన్ని పెనవేసుకుంటున్నారు.

**పొత్తుతోనే వైసీపీ చిత్తు :**

ఏపీలో త్రిముఖ పోరు సాగితే వైసీపీకి లాభిస్తుంది. ఎందుకంటే వైసీపీ అయిదేళ్ల పాటు అధికారం చూసింది గ్రౌండ్ లెవెల్ లో విస్తరించి ఉంది అలాగే అనేక సార్లు టీడీపీ అధికారంలో ఉంది. ఆ పార్టీ గ్రాస్ రూట్ లెవెల్ దాకా బలంగా ఉంది ఇలా రెండు బలమైన ప్రాంతీయ పార్టీల మధ్య అధికారం పూర్తిగా దక్కించుకోని జనసేన పోటీకి సొంతంగా దిగితే ఓట్లు చీలి వైసీపీకి అధికారం దఖలు పడుతుంది. అందువల్లనే పవన్ టీడీపీతో పదిహేనేళ్ళ బంధం అని అంటున్నారు. ఆ పార్టీతో కలసి ప్రయాణం చేయాల్సిందే అని శ్రేణులకు కూడా చెబుతున్నారు . కూటమితో ఉండడం అనివార్యం దానికి సిద్ధపడి పార్టీ పనిచేయాల్సి ఉంటుందని దిశా నిర్దేశం చేస్తున్నారు.

**పవన్ సందేశం ఇదే :**

విశాఖ వేదికగా మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న జనసేన విస్తృత స్థాయి పార్టీ సమావేశాలలో పవన్ క్యాడర్ కి ఇస్తున్న సందేశం ఇదే అని అంటున్నారు. కూటమి అన్నాక కొన్ని ఇబ్బందులు ఉంటాయి. కానీ రాష్ట్ర హితం కోరుకుంటూ సర్దుకుని పోవాలని ఆయన సూచిస్తున్నారు అని అంటున్నారు. జనసేనకు అధికారం పదవుల కంటే కూడా రాష్ట్రం చాలా ముఖ్యమని పవన్ పదే పదే చెబుతున్నారు. ఏపీలో టీడీపీ జనసేన పొత్తు ఏకంగా పదిహేనేళ్ళ పాటు కొనసాగించడానికి సిద్ధమని కూడా ఆయన చెబుతున్నారు. ఈ విధంగా జనసేన శ్రేణులను ఆయన మానసికంగా సిద్ధం చేస్తున్నారని అంటున్నారు.

**వైసీపీకి చిక్కులు తప్పవా :**

ఏపీలో టీడీపీ జనసేన బంధం ఎంత గట్టిగా ఉంటే అంత ఎక్కువగా వైసీపీకి చిక్కులు ఉంటాయి ఆ రెండు పార్టీలు కలిస్తే సహజంగానే వారి ఓటు షేర్ 50 శాతం దాటేస్తుంది. టీడీపీకి నలభై శాతం జనసేనకు పది శాతం కలుపుకుంటే చాలు అధికారం వారి చేతిలోనే ఉంటుంది ఈ మధ్యలో వైసీపీ తన ఓటు షేర్ ని మరో అయిదారు శాతం పెంచుకున్నా అధికారానికి దూరంగానే ఉంటుందని అంటున్నారు. మొత్తం మీద విశాఖ వేదికగా జరుగుతున్న జనసేన సమావేశాల నుంచి వైసీపీకి ఒక చేదు సందేశాన్నే పవన్ వినిపించబోతున్నారు అని అంటున్నారు. ఈ నెల 30న జరిగే బహిరంగ సభలో టీడీపీతో పొత్తుల గురించి ఆయనే మరింత గట్టిగా ప్రకటిస్తారు అని అంటున్నారు.

# నేతాజీ అవశేషాలు: మోడీకి నేతాజీ కుమార్తె భావోద్వేగపూరిత విజ్ఞప్తి

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్వాతంత్ర్య పోరాట యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ కుమార్తె అనితా బోస్ ప్ఫాఫ్, ప్రధాని నరేంద్ర మోదీకి ఒక భావోద్వేగపూరిత విజ్ఞప్తి చేశారు. తన తండ్రి అవశేషాలను జపాన్‌లోని టోక్యో నుంచి భారతదేశానికి తీసుకురావాలని ఆమె కోరారు. ప్రధాని మోదీ ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్న సందర్భంగా ఈ అభ్యర్థన చేశారు.

**నేతాజీ మరణంపై ఉన్న అస్పష్టత:**

1945 ఆగస్టు 18న తైవాన్‌లోని తైపేలో జరిగిన విమాన ప్రమాదంలో నేతాజీ మరణించారని సాధారణంగా నమ్ముతారు. ఆ తర్వాత ఆయన అవశేషాలను జపాన్‌లోని రెంకోజీ బౌద్ధ దేవాలయంలో భద్రపరిచినట్లు చెబుతారు. అయితే, ఈ విమాన ప్రమాదంలో నేతాజీ మరణించలేదని, అది ఒక కుట్ర అని కొందరు చరిత్రకారులు వాదిస్తూ వచ్చారు. ఈ అంశంపై దశాబ్దాలుగా అనేక వివాదాలు, సందేహాలు కొనసాగుతున్నాయి. అనేక కమిషన్లు కూడా నేతాజీ మరణంపై నివేదికలు సమర్పించినప్పటికీ, ఈ విషయంలో స్పష్టత రాలేదు.

**అనితా బోస్ ప్ఫాఫ్ విజ్ఞప్తి**



తన తండ్రి అవశేషాలను తిరిగి భారతదేశానికి తీసుకురావాలని అనితా బోస్ ప్ఫాఫ్ చాలాకాలంగా కోరుతున్నారు. ప్రధాని మోదీ జపాన్ పర్యటన నేపథ్యంలో ఆమె ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని "నా తండ్రి ఈ మట్టి కోసం, ఈ జాతి కోసం తన ప్రాణాలను అర్పించారు. ఆయనకు తగిన గౌరవం ఇవ్వాలంటే అవశేషాలు భారత్‌లో ఉండాలి. దానిని సాధించగల సామర్థ్యం మీకు ఉంది మోదీజీ," అని ప్రధానిని కోరారు.

**ప్రభుత్వ స్పందనపై ఉత్కంఠ**

నేతాజీ వారసులు, కుటుంబ సభ్యులు, అలాగే దేశ ప్రజలు దశాబ్దాలుగా ఆయన అవశేషాలను తిరిగి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఈ విషయంలో వివిధ ప్రభుత్వాలు చొరవ చూపినప్పటికీ స్పష్టమైన పురోగతి లేదు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ఈ విజ్ఞప్తిపై ఎలా స్పందిస్తారన్న దానిపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. నేతాజీకి తగిన గౌరవం ఇవ్వడం, దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం కోసం ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

# తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి సుప్రీం సపోర్టు.. ఇక తగ్గేదేలే అంటున్న వైసీపీ



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ నేత, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి సుప్రీంకోర్టులో భారీ ఊరట దక్కింది. 15 నెలలుగా సొంత నియోజకవర్గం తాడిపత్రిలో అడుగుపెట్టలేకపోతున్న పెద్దారెడ్డి ఈ విషయమై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శాంతిభద్రతల పేరుతో తనను తాడిపత్రిలో ఇంటికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని పెద్దారెడ్డి ఆరోపించారు. దీనిపై తొలుత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, పోలీసు భద్రత మధ్య పెద్దారెడ్డిని తాడిపత్రిలో ఆయన ఇంటికి తీసుకువెళ్లాలని సింగిల్ బెంచ్ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. అయితే దీనిపై ప్రభుత్వం డివిజన్ బెంచులో సవాల్ చేసింది. శాంతిభద్రతల సమస్యతో డివిజన్ బెంచ్ సింగిల్ బెంచ్ న్యాయమూర్తి తీర్పుపై స్టే విధించింది. ఈ తీర్పుపై పెద్దారెడ్డి సుప్రీంకోర్టుకు వెళ్లగా సింగిల్ బెంచ్ న్యాయమూర్తి ఇచ్చిన తీర్పు అమలు చేయాలని తీర్పు వెలువరించింది.సుప్రీం తీర్పుతో తాడిపత్రి రాజకీయాలు మరోమారు వేడెక్కాయి. ఈ నియోజకవర్గంలో టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి, వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉంది. ఇరువర్గాల వారు గతంలో అనేక సార్లు దాడులు, ప్రతిదాడులకు దిగడంతో తాడిపత్రి రక్తమోడింది. ఎన్నికల సమయంలో పరిస్థితి మరింత దిగజారడంతో జేసీ ప్రభాకర్ రెడ్డిని, సిట్టింగ్ ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని తొలుత తాడిపత్రి నుంచి బహిష్కరించారు. ఎన్నికల అనంతరం జేసీ ప్రభాకర్ రెడ్డి, అస్మిత్ రెడ్డిపై ఆంక్షలు తొలగించారు.ఆ తర్వాత కొద్ది రోజులకు పెద్దారెడ్డిపైనా ప్రభుత్వం ఆంక్షలు తొలగించినా, ఆయన తాడిపత్రిలో అడుగు పెట్టకుండా మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గం అడ్డుకుంటోంది. ఈ నేపథ్యంలో పెద్దారెడ్డి స్వగ్రామం తిమ్మంపల్లి నుంచి తాడిపత్రికి వచ్చేందుకు పలుమార్లు ప్రయత్నించారు. అయితే పోలీసులు మాత్రం అందుకు అంగీకరించలేదు. తాడిపత్రి ఊరు బయటే పెద్దారెడ్డిని ఆపేసి వెనక్కి పంపేవారు. ఈ పరిస్థితుల్లో పోలీసుల తీరును తప్పుపడుతూ పెద్దారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ ఆయనకు అనుకూలంగా తీర్పు వచ్చినా, పోలీసులు మళ్లీ అప్పీలు చేయడంతో పెద్దారెడ్డి తాడిపత్రిలో అడుగు పెట్టలేకపోయారు.ఈ విషయంపై పెద్దారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్కడ అనుకూలంగా తీర్పురావడంతో తాడిపత్రికి వచ్చేందుకు లైన్ క్లియర్ అయినట్లు చెబుతున్నారు. పెద్దారెడ్డి తన ఇంటికి వెళ్లకుండా ఎవరు ఆపుతున్నారని న్యాయస్థానం ప్రశ్నించింది. అదే సమయంలో ఆయన భద్రతకు సంబంధించి అవసరమైన ఖర్చును భరిస్తామని పెద్దారెడ్డి తరఫు న్యాయవాదులు కోర్టుకు చెప్పినట్లు సమాచారం. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం ఆయనకు భద్రత కల్పించాలని ఆదేశాలు విడుదల చేస్తూ విచారణను ముగించినట్లు ప్రకటించింది. దీంతో తాడిపత్రి పాలిటిక్స్ వేడెక్కే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు.

# ఒకే రోజులో 27 కోట్లతో 3 రోల్స్ రాయిస్ కార్లు కొనుగోలు చేసిన వ్యాపారవేత్త

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశ వ్యాపార ప్రపంచంలో కొన్ని సంఘటనలు మాత్రమే ప్రజల దృష్టిని ఆకర్షిస్తాయి. అటువంటి అసాధారణమైన సంఘటనలలో ఒకటిగా... కొల్హాపూర్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త.. దాత సంజయ్ ఘొడావత్ ఒకే రోజులో మూడు అత్యంత ఖరీదైన రోల్స్ రాయిస్ లగ్జరీ కార్లను కొనుగోలు చేసి సంచలనం సృష్టించారు. ఈ విషయం ప్రస్తుతం వ్యాపార, ఆటోమొబైల్ వర్గాల్లో విస్తృతంగా చర్చనీయాంశంగా మారింది. ఈ మూడు కార్ల విలువ దాదాపు ?27 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఈ కొనుగోలు సంజయ్ ఘొడావత్ యొక్క సంపద, వ్యాపార సామ్రాజ్యం.. అతని ప్రత్యేక అభిరుచులకు నిదర్శనం.

**ఘొడావత్: ఒక విజన్ ఉన్న పారిశ్రామికవేత్త**

సంజయ్ ఘొడావత్ కేవలం సంపన్నుడు మాత్రమే కాదు, ఒక విజన్ ఉన్న పారిశ్రామికవేత్తగా ప్రసిద్ధి పొందారు. ఆయన స్థాపించిన ఘొడావత్ గ్రూప్ అనేక రంగాల్లో తమ వ్యాపారాన్ని విస్తరించింది. విమానయానం, రియల్ ఎస్టేట్, విద్య, ఆహారం, ప్యాకేజింగ్, విద్యుత్ ఉత్పత్తి, రసాయనాలు వంటి వివిధ రంగాల్లో ఈ గ్రూప్ కార్యకలాపాలు సాగిస్తోంది. ఆయన నాయకత్వంలో, ఘొడావత్ గ్రూప్ కేవలం దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా తమ సత్తా చాటుతోంది. ముఖ్యంగా ఆయనకు చెందిన స్టార్ ఎయిర్ విమానయాన సంస్థ, దేశంలోని చిన్న, మధ్యతరహా నగరాలకు విమాన సేవలను అందిస్తూ భారతీయ విమానయాన రంగంలో ఒక కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఈ సంస్థ ముంబై–కొల్హాపూర్ వంటి కీలక మార్గాల్లో సేవలను అందిస్తూ ప్రయాణికుల మనసులు గెలుచుకుంటోంది.

**లగ్జరీ కార్లపై సంజయ్ ఘొడావత్ ప్రత్యేక ఆసక్తి**

సంజయ్ ఘొడావత్‌కు లగ్జరీ కార్లపై ఉన్న ఆసక్తి అందరికీ తెలిసిందే. ఇప్పటికే ఆయన వద్ద ఎన్నో ఖరీదైన కార్ల సేకరణ ఉంది. ఇందులో ఫెరారీ, లంబోర్ఘిని, మెర్సిడెస్ వంటి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కార్లు ఉన్నాయి. తాజాగా ఒకేరోజు మూడు రోల్స్ రాయిస్ కార్లను తన సేకరణలో చేర్చుకోవడం,




ఆటోమొబైల్ ప్రపంచంలో ఒక అరుదైన సంఘటనగా చెప్పవచ్చు. రోల్స్ రాయిస్ కార్లు కేవలం వాహనాలు మాత్రమే కాదు, అవి శైలి, వైభవం.. కీర్తికి చిహ్నాలు. ఈ కార్లు ప్రత్యేకంగా, కొనుగోలుదారుల అభిరుచుల ప్రకారం కస్టమైజ్ చేయబడతాయి. ఘొడావత్ తన సేకరణను విస్తరించడం, ఆయన వ్యాపార విజయానికి, శ్రమకు లభించిన ప్రతిఫలం అని చెప్పవచ్చు.

**వ్యాపారవేత్తగానే కాకుండా ఒక గొప్ప దాత**

ఘొడావత్ కేవలం వ్యాపారంలోనే కాకుండా, సామాజిక సేవలో కూడా ముందుంటారు. సమాజానికి తిరిగి సేవ చేయాలన్న తన నిబద్ధతతో, ఆయన పలు దాతృత్వ కార్యక్రమాలను చేపట్టారు. ఆయన స్థాపించిన విద్యా సంస్థలు, వైద్య కేంద్రాలు, సామాజిక సంక్షేమ కార్యక్రమాలు సమాజంలో గణనీయమైన మార్పు తీసుకువస్తున్నాయి. ముఖ్యంగా విద్యారంగంలో, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఆయన కృషి ఎంతో ప్రశంసనీయం. ఈ కార్యక్రమాల ద్వారా ఆయన కేవలం సంపన్నుడుగానే కాకుండా, ఒక బాధ్యత గల పౌరుడిగా, దాతగా ప్రజల మనస్సుల్లో నిలిచిపోయారు. ఈ విధంగా సంజయ్ ఘొడావత్ తన వ్యాపార నైపుణ్యంతో పాటు, సామాజిక స్పృహతో అందరికీ స్ఫూర్తినిస్తున్నారు.

ఒకే రోజులో మూడు రోల్స్ రాయిస్ కార్లను కొనుగోలు చేసిన సంజయ్ ఘొడావత్ కథ, భారతదేశంలో వ్యాపార ప్రపంచం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతోందో తెలియజేస్తుంది. ఈ సంఘటన, ఆయన కృషి, పట్టుదల.. వ్యాపార విజయాన్ని సూచిస్తుంది. అయితే, ఆయన తన సంపదను సమాజ సంక్షేమం కోసం కూడా ఉపయోగిస్తున్నారనేది మరింత గొప్ప విషయం.

# జగన్ కోసం సీబీఐ గొంతునొక్కేస్తారా? ఏపీసీసీ చీఫ్ షర్మిల సంచలన ఆరోపణలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన సోదరుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డిపై మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తన చిన్నాన్న మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో న్యాయం కోసం తాము ఇంకా ఎన్నాళ్లు పోరాడాలని ప్రశ్నించారు. వివేకా కుమార్తె సునీత పోరాటంలో న్యాయం ఉందని వ్యాఖ్యానించిన షర్మిల.. ఈ కేసులో జగన్ కోసం ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థ సీబీఐ గొంతు నొక్కేస్తోందని ఆరోపించారు. వివేకా కేసును పునర్విచారించాలని డిమాండ్ చేసిన షర్మిల, అసలు దోషులను గుర్తించకుండా దర్యాప్తు ముగిసిందని సీబీఐ ప్రకటించడంపై మండిపడ్డారు.వివేకానంద రెడ్డి హత్య కేసుపై విజయవాడలో మీడియాతో షర్మిల మాట్లాడారు. వివేకా హత్య విషయంలో మళ్లీ దర్యాప్తు చేపట్టకపోవడాన్ని నిలదీశారు. వై నాట్ అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన షర్మిల.. ఆరేళ్లుగా పోరాటం చేస్తున్నా న్యాయం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసులో నిందితుడు, కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డిని రక్షించేందుకు జగన్ అడ్డుపడుతున్నాడని షర్మిల ఆరోపించారు. హత్య జరిగిన సమయంలో అవినాశ్ రెడ్డి అక్కడే ఉన్నట్లు గూగుల్ మ్యాప్



లొకేషన్లు ఉన్నాయని షర్మిల ఆరోపించారు.జగన్ ప్రధాని మోదీకి దత్తపుత్రుడు, ప్రధాని మోదీ చేతిలో సీబీఐ కీలుబొమ్మ. జగన్ కోసం సీబీఐ గొంతునొక్కారంటూ షర్మిల తీవ్ర ఆరోపణలు చేశారు. జగన్ కోసమే నిందితుడు అవినాశ్ రెడ్డిని కాపాడుతున్నారని ఆమె వ్యాఖ్యానించారు. నిజంగా సీబీఐ అనుకుంటే దోషులకు ఎపుడో శిక్ష పడేదని చెప్పారు. వివేకా హత్య కేసులో అన్ని ఆధారాలు ఉన్నాయని.. గూగుల్ మ్యాప్ లొకేషన్లు కూడా ఉన్నాయని షర్మిల పేర్కొన్నారు. వైఎస్ వివేకా హత్య జరిగినప్పుడు అవినాష్ రెడ్డి సంఘటనా స్థలంలో ఉన్నాడని.. ఇందుకు సంబంధించి సాక్ష్యాధారాలు కూడా ఉన్నాయని షర్మిల తెలిపారు. ఇన్ని ఆధారాలు ఉన్నప్పటికీ.. న్యాయం ఎందుకు జరుగడం లేదని ప్రశ్నించారామె. సీబీఐ విచారణ సరిగా లేదంటూ సునీత చేసిన ఆరోపణలు నిజముందన్నారు.షర్మిల వ్యాఖ్యలతో వివేకా హత్య కేసు మరోమారు చర్చనీయాం శమైంది. ఈ కేసుపై రాష్ట్ర ప్రభుత్వం కూడా చాలా సీరియస్ గా ఉందని అంటున్నారు. కడప జైల్లో అప్రూవర్ దస్తగిరిని బెది రించిన కేసుపై తాజాగా విచారణకు ఆదేశించిన రాష్ట్ర ప్రభు త్వం తన వైపు నుంచి వివేకాకు న్యాయం చేయడానికి పావులు కదుపుతోందని అంటున్నారు. నిందితుల్లో ఒకరైన వైసీపీ నేత శివశంకర్ రెడ్డి కుమారుడు చైతన్యరెడ్డి మెడికల్ క్యాంపు పేరిట జైలుకు వెళ్లి దస్తగిరిని బెదిరించినట్లు కేసు నమోదైంది. దీనిపై తాజాగా నిజానిజాలు నిగ్గుతేల్చాలని ప్రభుత్వం పావులు కదుపు తోంది. మరోవైపు గత ప్రభుత్వంలో సాక్షులను బెదిరిస్తున్నారనే ఆరోపణలతో వైఎస్ సునీత దంపతులతోపాటు, సీబీఐ ఎస్పీ రాంసింగ్ పై పోలీసు కేసులు దీన్ని ఇటీవలే సుప్రీంకోర్టు కొట్టివేసింది. అదే సందర్భంలో హత్య కేసును త్వరలో తేల్చేస్తామని స్పష్టం చేసిం ది. ఈ నేపథ్యంలో షర్మిల బయటకు వచ్చి చిన్నాన్న హత్యలో తమకు న్యాయం జరగడం లేదని, సొంత సోదరుడిపైనే విమర్శలు చేయడం గమనార్హం.

# ఆస్ట్రేలియా టూరే చివరిదా?.. రోహిత్, కోహ్లీ భవిష్యత్తుపై ఆసక్తికర చర్చ

**రోహిత్, కోహ్లీల వన్డే భవిష్యత్తుపై మాజీ వికెట్ కీపర్ విజయ్ దహియా వ్యాఖ్యలు**

**రిటైర్మెంట్‌పై వారే తుది నిర్ణయం తీసుకోవాలన్న దహియా**

**నిర్ణయంలో టీమ్ మేనేజ్‌మెంట్‌కూ కీలక పాత్ర ఉంటుందని వెల్లడి**

**వారి సేవలను గౌరవించాలని, వారి ఆటను ఆస్వాదించాలని సూచన**

**ఆస్ట్రేలియా పర్యటనే వారికి చివరి వన్డే సిరీస్ కావొచ్చని ఊహాగానాలు**




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వన్డే ఫార్మాట్ నుంచి కూడా రిటైర్ అవుతారనే ప్రచారం జోరుగా సాగుతున్న నేపథ్యంలో భారత మాజీ వికెట్ కీపర్ విజయ్ దహియా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 2027 వన్డే ప్రపంచకప్ వరకు వారు ఆడాలా? వద్దా? అనే తుది నిర్ణయం పూర్తిగా వారికే వదిలేయాలని, ఆ హక్కు వారికి ఉందని దహియా అభిప్రాయపడ్డాడు. భారత క్రికెట్‌కు వారు అందించిన అపారమైన సేవలను దృష్టిలో ఉంచుకుని, ఈ విషయంలో వారికే పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని ఆయన స్పష్టం చేశాడు. అయితే, ఈ విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్, సెలెక్టర్ల పాత్ర కూడా కీలకంగా ఉంటుందని దహియా అంగీకరించాడు. "కొన్నిసార్లు మనం ఈ దిగ్గజ ఆటగాళ్లను గౌరవించడం మర్చిపోతాం. వారు ఆడుతున్నంత కాలం భారత క్రికెట్‌కు చేసిన సేవలను గుర్తించి, వారిని గౌరవించుకోవాలి. ఎప్పుడో ఒకప్పుడు అందరూ క్రికెట్‌ను వీడాల్సిందే. కానీ వారు అందించిన విజయాలను మనం ఆస్వాదించాలి" అని ఆయన 'స్పోర్ట్స్‌యారీ'తో అన్నాడు."ఆటపై ప్రేరణ, ఫిట్‌నెస్ అనేవి ఆటగాళ్ల వ్యక్తిగత విషయం. వారి తరఫున ఇతరులు నిర్ణయం తీసుకోవాలని చూస్తుంటారు. కానీ ఇది వారి వ్యక్తిగత నిర్ణయం. వారు దేశానికి అందించిన సేవలను బట్టి చూస్తే, ఏం చేయాలో, ఏం చేయకూడదో వారికి ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదు" అని దహియా తేల్చిచెప్పాడు. ఇప్పటికే టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికిన ఈ ఇద్దరూ, అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియాతో జరిగే మూడు వన్డేల సిరీస్‌తో ఈ ఫార్మాట్‌కు కూడా గుడ్‌బై చెప్పవచ్చని వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే.

ఈ సందర్భంగా రోహిత్ శర్మ, ఎంఎస్ ధోనీ కెప్టెన్సీల మధ్య పోలికలు తేవడాన్ని దహియా తప్పుబట్టాడు. "ఇద్దరూ భిన్నమైన నాయకులు, ఇద్దరూ తమ జట్లకు ట్రోఫీలు గెలిచిపెట్టారు. రోహిత్ దూకుడు శైలి ప్రత్యేకం, ధోనీ ప్రశాంతత విలక్షణమైనది. వారిద్దరినీ పోల్చడం సరికాదు" అని ఆయన వివరించాడు.

# 2027 వన్డే వరల్డ్ కప్‌లో కోహ్లీ, రోహిత్ ఆడాలంటే..: ఇర్ఫాన్ పఠాన్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమ్ఇండియా దిగ్గజ క్రికెటర్లు రోహిత్ శర్మ విరాట్ కోహ్లీ ఇప్పటికే టీ20, టెస్ట్ క్రికెట్‌కు తమ రిటైర్మెంట్ ప్రకటించారు. ప్రస్తుతం వారిద్దరూ వన్డే ఫార్మాట్‌లోనే కొనసాగుతున్నారు. వీరు చివరిసారిగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్ఇండియా తరఫున ఆడుతూ కనిపించారు. తిరిగి వీరు అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియాతో ప్రారంభం కానున్న మూడు వన్డేల సిరీస్‌లో పాల్గొననున్నారు. ఈ మేరకు రో–కో ద్వయం ఇప్పటికే తమ ప్రాక్టీస్ ప్రారంభించారు. ఈ మూడు వన్డే మ్యాచ్‌ల్లో ప్రదర్శనను బట్టే వీరి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని పలువురు క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే 2027 వన్డే వరల్డ్ కప్‌లో వారు టీమ్ఇండియా స్క్వాడ్‌లో భాగమవుతారా? కారా? అన్న విషయంలో ఇప్పటికైతే క్లారిటీ లేదు. అప్పటికి రోహిత్ శర్మకు 40, విరాట్ కోహ్లీకి 39 సంవత్సరాలు వస్తాయి. అలాంటి పరిస్థితుల్లో వారు వరల్డ్ కప్‌లో కనిపించడం కాస్త కష్టమనే వాదనలూ వినిపిస్తున్నాయి. అప్పటి వరకు రెగ్యులర్‌గా క్రికెట్ ఆడుతూ, ఫిట్‌నెస్ కాపాడుకోవడమే వీరిద్దరికీ సవాల్. వన్డే మ్యాచ్‌ల సంఖ్య తగ్గిపోయిన ప్రస్తుత కాలంలో ఇది నిజంగా వారికి కత్తిమీద సామే. అయితే వారు తమ ఫామ్, ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటే.. రో–కో ద్వయాన్ని పక్కనపెట్టే సాహసం సెలక్టర్లు చేయకపోవచ్చు. ఇదే విషయమై టీమ్ఇండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. 'ఫిట్‌గా ఉంటూ, రెగ్యులర్ క్రికెట్ ఆడటం కొనసాగించడమే విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ముందున్న అతిపెద్ద సవాల్. అప్పుడు మాత్రమే వారు 2027 వన్డే వరల్డ్ కప్ ఆడగలరు. ప్రస్తుతం వారు ఐపీఎల్, ఇంకా ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడగలరు. అయితే అది తాము కొత్తగా ఏదైనా సాధించడం కోసం మాత్రం కాదు. కేవలం రిథమ్ కాపాడుకోవడానికి మాత్రమే. ఇప్పుడు వన్డేల స్థానాన్ని టీ20లు ఆక్రమించాయి. వన్డేల సంఖ్య తగ్గి, టీ20ల సంఖ్య పెరిగింది. ఒక వేళ వీరిద్దరూ ఫామ్, ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటే వన్డే వరల్డ్ కప్‌లో వారు ఆడటం కష్టం కాదు. కానీ దురదృష్టవశాత్తూ వారి మీద ఒత్తిడి ఉంది' అని ఇర్ఫాన్ పఠాన్ అన్నాడు.

# నిరూపించుకోవడానికి ఏమీలేదు.. అదే నా విజయ సూత్రం: పీవీ సింధు







**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో తెలుగుతేజం పీవీ సింధు అదరగొట్టింది. వరల్డ్ నంబర్ 2 ప్లేయర్ వాంగ్ యును చిత్తు చేసింది. 2019లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన సింధు మళ్లీ అదే ఫామ్‌తో ఈసారి అడుగు పెట్టింది. గాయాలు ఎదురైనా 'ఫిట్‌నెస్'ను కాపాడుకుని ఈ టోర్నీలో ప్రవేశించింది. భారీ వేదికపై రిథమ్‌ను అందుకోవడానికి పడిన శ్రమకు ప్రతిఫలం దక్కినట్లు సింధు వెల్లడించింది. ఇప్పుడు రెండో ర్యాంకర్‌పై విజయం సాధించడంపై స్పందించింది.

"నేను నిరూపించుకోవడానికి పెద్దగా ఏమీలేదు. నా సత్తా ఏంటో ఇప్పటికే వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో నిరూపించా. ప్రత్యేకంగా ఎవరి కోసమో ఆడాల్సిన అవసరం లేదు. విజేతగా నిలవడంపైనే దృష్టిపెట్టా. అయితే, గత రెండేళ్ల నుంచి నా ఆరంభం గొప్పగా లేదు. కెరీర్‌లో చాలా ఒడిదొడుకులు ఎదుర్కొన్నా. గాయపడటం కూడా ఇబ్బందిగా మారింది. గెలవాలని తీవ్రంగా ప్రయత్నించినా సాధ్యపడలేదు. కానీ, ఫిట్‌నెస్‌పై మరింత దృష్టిసారించి మళ్లీ నూతన ఉత్సాహంతో అడుగు పెట్టా. కేవలం ప్రపంచ ఛాంపియన్‌షిప్ కోసం చాలా కష్టపడ్డా. ప్రతి టోర్నీ ముగిసిన తర్వాత.. నేను చేసిన పొరపాట్లు ఏంటో కోచ్‌తో కలిసి చర్చిస్తుంటా. మరోసారి తప్పిదం చేయకుండా ఉండేందుకు ప్రయత్నిస్తా. ఇప్పుడు ఈ టోర్నీలో దాని ఫలితం కనిపిస్తోంది" అని సింధు వెల్లడించింది. క్వార్టర్ ఫైనల్‌లో ఇండోనేషియాకు చెందిన పీకే వార్దనితో పీవీ సింధు ఇవాళ తలపడనుంది. ప్రస్తుతం వార్దని ప్రపంచ మహిళా బ్యాడ్మింటన్ విభాగంలో తొమ్మిదో ర్యాంకులో ఉంది. మరోవైపు పీవీ సింధు 15వ స్థానంలో కొనసాగుతోంది. నాకౌట్ దశలో టాప్ ర్యాంకర్లతో సింధు పోటీ పడాల్సి ఉంది. సెమీస్‌లోనూ కఠిన ప్రత్యర్థి తప్పదు. అయితే, ప్రపంచ రెండో ర్యాంకర్‌పైనే గెలిచిన సింధు మిగతా ప్లేయర్లపై ఆధిపత్యం ప్రదర్శించడం పెద్ద కష్టమేం కాదనేది క్రీడా విశ్లేషకుల అంచనా.

**పూజా హెగ్డే టుట్టి ఫ్రూటీ క్యూటీ**



# రాజా సాబ్ మీదే ఆ ఇద్దరి హోప్స్..?

రెబల్ స్టార్ ప్రభాస్ రాజా సాబ్ సినిమాను మారుతి చాలా పెద్ద ప్లానింగ్ తోనే చేస్తున్నాడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణంలో వస్తున్న ఈ సినిమాలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ హీరోయిన్ గా నటించింది. సినిమా టీజర్ లోనే ఈ ఇద్దరి పాత్రలను ఇంట్రడ్యూస్ చేశాడు మారుతి. సో తప్పకుండా ఈ ఇద్దరికి సినిమాలో మంచి రోల్స్ పడినట్టు ఉన్నాయి. రెబల్ స్టార్ ప్రభాస్ తో ఛాన్స్ కాబట్టి కచ్చితంగా ఈ ఇద్దరికి మంచి ఛాన్స్ ఉంటుంది.

**రాజా సాబ్ తోనే అమ్మడు హిట్ టార్గెట్..**



ఐతే నిధి అగర్వాల్ విషయానికి వస్తే ఈమధ్యనే హరి హర వీరమల్లు సినిమాతో వచ్చింది. ఆ సినిమాలో తన రోల్ లెంగ్త్ ఎలా ఉన్నా ఉన్నంతలో ఓకే అనిపించింది. ఐతే రాజా సాబ్ తోనే అమ్మడు హిట్ టార్గెట్ పెట్టుకుంది. హరి హర వీరమల్లు ప్రమోషన్స్ టైం లో నిధి చాలా కష్టపడింది. మరి ప్రభాస్ రాజా సాబ్ కోసం కూడా అదే తరహాలో ప్రమోషన్స్ చేస్తుందా లేదా అన్నది చూడాలి. ఐతే ప్రభాస్ రాజా సాబ్ తో హిట్ ట్రాక్ ఎక్కాలని చూస్తుంది అమ్మడు. ఇక మలయాళ భామ మాళవిక మోహనన్ ని చూస్తే.. ఇప్పటికే తమిళ్, మలయాళ భాషల్లో సినిమాలు చేస్తుంది అమ్మడు. ఐతే తెలుగులో తనకు ఇదే తొలి సినిమా.. ఈ సినిమాతో అమ్మడు తెలుగు ఆడియన్స్ ని మెప్పించాలని చూస్తుంది. సినిమాలే కాదు ఫోటో షూట్స్ తో కూడా మెప్పిస్తున్న మాళవిక మోహనన్ రాజా సాబ్ హిట్ పడితే మాత్రం తెలుగులో మరిన్ని ఛాన్స్ లు రాబట్టుకుంటుంది.

**మ్యూజిక్ కూడా సంథింగ్ స్పెషల్..**

నిధి అగర్వాల్, మాళవిక ఈ ఇద్దరు కూడా రాజా సాబ్ తో తమ లక్ టెస్ట్ చేసుకోవాలని చూస్తున్నారు. ఈ ఇద్దరు అందాల భామలు కూడా ఈ సినిమా మీదే హోప్స్ పెట్టుకున్నారు. మరి మారుతి ఈ ఇద్దరిని ఎలా ప్లాన్ చేశాడో చూడాలి. రాజా సాబ్ సినిమా నిన్నటిదాకా డిసెంబర్ 5కి రిలీజ్ అని చెప్పగా లేటెస్ట్ గా సినిమాను సంక్రాంతి బరిలో దించుతున్నట్టు అనౌన్స్ చేశారు మేకర్స్. రాజా సాబ్ సినిమాకు థమన్ ఇస్తున్న మ్యూజిక్ కూడా సంథింగ్ స్పెషల్ గా ఉండబోతుంది. తప్పకుండా ఈ మూవీపై థమన్ కూడా తన మార్క్ సెట్ చేస్తాడని చెప్పొచ్చు. రాజా సాబ్ సినిమా 2026 సంక్రాంతికి మెగాస్టార్ మన శంకర వరప్రసాద్ తో పాటుగా మరో రెండు సినిమాలతో పోటీ పడుతుంది.

**సంప్రదాయంలో వైష్ణవి చైతన్య దయ**



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com